ముద్రణ :
1956.

ప్రకాశకులు :
పింజల సోమశేఖరరావు,
వేటపాలెము
బాపట్ల తాలూకా :: గుంటూరు జిల్లా.

సారస్వత నికేతన ముద్రాక్షరశాల,
వేటపాలెము.

## అంకితము

నిస్స్వార్థబుద్ధితో నిరంతరము రెండుకోట్ల చేనేతవారి జీవితసమస్యకై నిర్విరామంగా కృషి చేయుచున్న నిర్వ్యాజ కరుణార్ద్రహృదయులు, ఆంధ్ర శాసనసభాసభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సహాయకార్యదర్శులు, అఖిలభారత చేనేత కాంగ్రెసు ప్రధానకార్యదర్శులు నగు

**శ్రీ ప్రగడ కోటయ్య గారికి.**

నాకవితాకుమారి పద
నం బఱనాలిచి సిగ్గుపెంపెరన్
లోకమెఱుంగ దిప్డిపుడు
రూపులుతిన్నఁగ దిద్దికొన్నదై
నీ కయిపండ గోరినది
నెమ్మిమెయిన్ గ్రహియించి దీనినిన్
సాకుమ, నూత్నవైభవ యు
శః పరిరంభణమబ్బ కోటయా!

OPINION

OF

ANDHRA CHIEF MINISTER

*I have gone through Sri Pinjala Somasekhara-Rao's book entitled Vasthra Nirmatha. I thought it was going to be a mere propaganda play but the language of the ideas and the manner in which he has put the entire theme is very powerful and gripping I have gone through it carefully and the author has achieved his ideas more than he expected. I wish the play could be staged The problems of handlooms are clearly brought out and I congratulate the author on his success.*

KURNOOL,

B. GOPALA REDDY

13·9·56

## ఆంధ్ర ముఖ్యమంత్రి

## అభిప్రాయము

శ్రీ పింజల సోమశేఖరరావు గారు రచించిన "వస్త్ర నిర్మాత" యను గ్రంథమును బరికించితిని. అది కేవల మొక ప్రచారమునకుఁ బనికివచ్చు నాటికయే మోయని తలంచితిని. కాని భావద్యోతకమగు భాషయేమి కథావస్తువును నడపించిన విధానమేమి రసవత్తరమై మనస్సును హత్తుకొనిపోవుచున్నది. నేను దానిని జాగరూకతతోఁ బరికించితిని. కవి తనయాదర్శములఁ దానుద్దేశించినదానికన్న మిన్నగ సాధింపఁగల్గెను. ఈ నాటకము ప్రదర్శనయోగ్యమని తలంతును. చేమగ్గములఁ గూర్చిన సమస్యలు విస్పష్టముగాఁ బరిష్కరింపఁ బడినవి. విజయము పొందినందులకు గ్రంథకర్త నభినందించుచున్నాను.

కర్నూలు
**13. 9. '56**

బి. గోపాలరెడ్డి.

ఇదొక విషాదాంతనాటకము. వస్త్రనిర్మాత జీవితము నేడు విషాదపూరితమైనది. అతని జీవితమును చిత్రించబూను నాటకము విషాదాంతముగాకేమౌను?

చేనేత పారిశ్రామికుని వృత్తి మిల్లుపోటివల్ల పోయింది. అతడు నిరుద్యోగియైనాడు. కుటుంబము జరుపుకొనుటకు అప్పు చేసినాడు. అప్పునిచ్చినవాడొక ధనిక కసాయి. లక్షలు కూడబెట్టుటయే అతనిపని. ఎందుకు కూడబెట్టుచున్నాడు, అతని ధనపిపాసవల్ల ఎన్ని కుటుంబాలు నాశనమౌచున్నవి అతనికి పట్టలేదు. చేనేత పారిశ్రామికుని పూరిల్లు ధనికుడు స్వాధీనపఱచుకొని ఆకలితో అలమటించుచున్న సంసారమును బయటికి నెట్టినాడు. ఆకలి ఆ సంసారాన్ని బలిగొన్నది.

ధనవంతుడు తనపిపాసకు కన్నకూతురినిగూడ ఆహుతి చేసినాడు. తాను కూడబెట్టిన లక్ష రూపాయలలో ఇరవదియైదువేలు లోటుపడినతోడనే పిచ్చివాడైనాడు. శేష జీవితమంతా పిచ్చి ఆస్పత్రిలోనే గడపినాడు.

నిరుపేదతనమువల్ల చేనేత కుటుంబ మంతరించినది. మానవత్వమే నశించుటవల్ల ధనికుని కుటుంబ మంతరించినది. పర్యవసాన మొక్కటే. ఇదే భగవంతుని మాయాలీల.

ఈకవి వస్త్రనిర్మాతల సంఘంలో జన్మించినాడు. "నేను వస్త్రనిర్మాతల సంఘంలో పుట్టినం ందుకు, ఏదో నాకు కవిత్వ మబ్బినందుకు నాకలాన్ని సంఘంకోసం వినియోగిస్తాను" అని సంకల్పించి ఈ ఉత్తమకావ్యాన్ని రచించినాడు. హృదయమున్న ప్రతివారిని కదలించగల కావ్యమిది. నేటిచేనేత లోకసంచలన మును కన్నులముందు ప్రదర్శించుచున్నది. పేదలకష్టములవైపు ప్రజలదృష్టిని కేంద్రీకరింపజేయుచున్నది.

ప్రతివారు చదువవలసిన గ్రంథము. కళాకారులు ప్రదర్శించుటకు అనువైనది. వాడ వాడల నీ నాటకము ప్రదర్శింపబడుగాక.

పేదవారి జీవితము నేటి కవుల కథావస్తువులగుట సంత సింపదగినది. ఈజాతికావ్యము లనేకము ఈకవి కలమునుండి వెలువడునని ఆశించుచున్నాము.

మంగళగిరి
**24. 9. '56**

దామర్ల రమాకాంతరావు
ఆంధ్రదేశ చేనేత సహకారసంఘాధ్యక్షుడు.
విజయవాడ

# నా మాట

భారతయశోదీప్తులు ఖండాంతర వ్యాప్తి గాంచిన రోజులవి. ఆనాఁడు వస్త్రనిర్మాత స్వర్ణయుగనిర్మాత. దేశ దేశాలతని కళాకౌశలమునకు మురిసిపోయినవి. ఈనాఁడతని జీవితం అయోమయం! అంధకారబంధురం! యంత్రమాతనికి గొడ్డలిపెట్టయింది. నిరుద్యోగపిశాచి అతనినెత్తిన నాట్యమాడు తూంది. దరిద్రదేవత యినుపపాదాలక్రింద నలిగిపోతున్నాఁడతఁడు. అతని కన్నీటి గాథ నా హృదయాన్ని కలాన్ని కదిలించింది. ఆకదలికలో నా కిదొక కుదిరిక. ఆంధ్రనాటక సరస్వతికిది నా రెండవకానుక.

ఈ నాటకరచనకు, ప్రచురణకు నాకెంతయో ప్రోత్సాహ మొసగుచువచ్చిన నామిత్రులు శ్రీ పింజల వేంకటేశ్వర్లు గారికిని, శ్రీ ధేవన చంద్రశేఖరరావు గారికిని కృతజ్ఞుఁడను.

ఎడతెగని కార్యనిర్వహణ భారమున తీరికలేకపోయినను ఓపికతో నా పుస్తకాన్ని సమీక్షించి తమ అమూల్యాభిప్రాయాల్ని అందజేసిన "ఆంధ్ర ముఖ్యమంత్రి" శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారికిని, శ్రీ దామర్ల రమాకాంతరావు M. A. గారికిని నా నమోవాకములు దెలుపుకొను చున్నాను.

ఈ నాటకము నందలి ఔచితీ నిర్ణయమును గుఱించిన విషయము గుణవిచక్షణులగు విచక్షణులకే విడిచిపెట్టు చున్నాను.

వేటపాలెము
19. 10. '56

ఇట్లు
సోమశేఖరరావు.

# ఇందలి పాత్రలు

పురుషులు

సుధాకరరావు:- చేనేతసమస్యకై పాటుపడుచున్న యువకవి.

ప్రభాకరరావు :- సుధాకరుని స్నేహితుడు.

సుబ్బరాజు:- మిల్లుభాగస్థుడు. లక్షాధికారి,

గోవిందు:- సుబ్బరాజు గుమాస్తా.

పేరయ్య:- నిరుపేద నేతకార్మికుడు.

ప్రసాదు:- పేరయ్య కొడుకు

రాముడు:- సుబ్బరాజుదగ్గఱ పనివాడు.

స్త్రీలు

జయలక్ష్మి:- సుధాకరరావు చెల్లెలు.

పేరమ్మ:- పేరయ్య భార్య.

సత్యవతి:- సుబ్బరాజు కూతురు, వితంతువు.

ఇంకా అమీనా, పోలీసు మొదలగువారు వత్తురు.

శుభమ్

# వస్త్రనిర్మాత

## ఒకటవ రంగము

సమయము : ఉదయము

సుధాకరరావు గృహము

(బాలభానుని అరుణకిరణాలు గృహాంగణంలోనికి ప్రసరిస్తుంటాయి. పంచలో ఒకటేబులు అటు ఇటు రెండుకుర్చీలు వేయబడి యుంటాయి. ఇంకొకప్రక్క మగ్గము పెట్టబడియుంటుంది. వాకిటిముందటి ఖాళీ స్థలంలో ఒకప్రక్కగా ప్రత్తిచెట్లుంటాయి. సుధాకరరావు చెల్లెలు జయలక్ష్మి నీళ్ళకడవతో పాడుకొంటూవచ్చి పాదుల్లో నీళ్ళుపోస్తూ)

గేయము

ప్రత్తి చెట్టేమాకు - వరహాలచెట్టు
ప్రత్తి చెట్టేమమ్ము - బ్రతికించు చెట్టు ప॥
స్వర్ణయుగము నాడు - జగజగాలెల్ల
స్వర్ణకీర్తి ప్రభల్ - వ్యాప్తి చేసినది ప॥
బంగారమదిపండె - భరతదేశాన
రంగారు మాపైడి - ప్రత్తిమూలాన ప॥

(పాడుతూ కదవతో లోనికిఁబోయి ఏకులబుట్టతో వచ్చి రాట్నము దగ్గరకూర్చుండి నూలుతీస్తూ)

ఈ నూలుపోగు తోనే కదా! మాగాంధి
రగిలించినాఁడు విప్లవమహాగ్ని
ఈ నూలుపోగు తోనే కదా! మాగాంధి
సవరించినాఁడు నిస్స్వార్థ్యపథము
ఈ నూలుపోగు తోనే కదా! మాగాంధి
తేర్లించినాఁడు స్వాతంత్ర్యరథము
ఈ నూలుపోగు తోనే కదా! మాగాంధి
సడలించినాఁడు పాశ్చాత్యబలము
ఈ వడకునూలుపోగుతోనే ఫలించె
భారతీయుల స్వేచ్ఛా తపఃఫలంబు
జాతి పునరుద్భవమునకు సాధనమయి
పరగు నీ నూలుపోగు సంపదలపోగు.

(పాడుతూ లోనికిఁ బోవును)

[ప్రవేశము స్వర్ణయుగాన్ని ఆలాపిస్తు సుధాకరరావు]

ఒకకాలాన- ప్రపంచమంతటికి- అ
త్యుచ్ఛస్థితిఁగాంచి- ఎ
న్నికగైకొన్నది దేశదేశములునుఁ
గీర్తింప- ప్రాక్పశ్చిమా
లకు వాణిజ్యవశాన నాగరికతల్
నాజూకులుఁ దిద్ది తీ
ర్చి- కళాకాంతులు పాదుకొల్పినది-మా
చేనేత మేల్బంతియై.

నా మర్గానికి నాఁడు చల్లనిదినాల్
నా రాట్నమానాఁడు ది
క్సీమాంతంబులు మాఱుమో్రియఁగ జయ
శ్రీ గీతము ల్పాడె-నా
సామర్థ్యానికి నా కళాప్రతిభకున్
సమా్రిట్టులే మెచ్చి యెం
తే మన్నించిరి – పల్లకీలపయి నూ
రేగించి ర త్యున్నతిన్.

ప్రభాకరరావు:– (ప్రవేశించి) కవికుమారు లేదో కవితా సమాధిలో ఉన్నట్లున్నదే ?

సుధా;– ఓహో! ప్రభాకరరావా ? రా కూర్చో.

ప్రభా:– (కూర్చుండును)

సుధా:– (కూర్చుండి) ఏమీ లేదు. తలపోఁతలో నా కొల పోఁత. కాలగర్భంలో కలిసిపోయినా చారిత్రక జగత్తులో యుగయుగాలకు మాసిపోవని–మఱపురాని–స్వర్ణ యుగాన్ని జ్ఞాపకం చేసికొంటున్నా. నా శరీరంతో పాటు నా కలం పులకితమై భావనా ప్రపంచంలో పరుగులు వారుతూంది. ఏదో వ్రాశాను.

ప్రభా:– ఏదీ–మచ్చుకొక పద్యాన్ని గానం చేయి చూదాము

సుధా:–

రవసెల్లాలు రహించె–కోమనులసా
మ్రాజ్యాన–మఙ్లను లాం
గ్ల వరారోహల మోహవాహినుల ము
న్ల–ల్వొట్టగా జేసె–దే

శ విదేశాలను వస్త్రకారునకుం బూ
జ్యశ్రీలు పాలించె-వి
శ్వ విహారం బొనరించె భారత ఘనశః
పారిచర్య విన్యాసముల్.

పరిభా:- ఆహా! ఏమి కవిత్వం! పదపదాన జాతీయత తొణికిస లాడుతూంది. విశ్వపరిచారానికీ, విశృంఖల విహారాన్ని సాగించే టట్లుంది నీ పద్యం. ఇంకేమైనా వారిశావా?

సుధా:- వింటావా? ఇంకా-

రతనాలమ్మిరి-రాసిపోసికొని కొ
ల్లల్ కొల్లలుం బోవ భా
రతదేశాన-వణిగ్వరేణ్యుల మహా
పాసాదరంగాలు వి
స్తృతవాణిజ్య రమానివాసితము ల
య్యెన్; దేశసౌభాగ్య సం
స్థితియున్ వేసిన వేయిరూపములతోం
జెన్నొంపె మిన్నందుచున్.

పరిభా:- అబ్బా! పళ్లు పులిసిపోయే ఐశ్వర్యం. మళ్లీచూస్తామా ఆ రోజుల్ని?

సుధా:- చూడవచ్చు. సమస్యలన్నీ చక్కబడి గాంధిగారి ఆశయాలు ఫలిస్తే-ఈ పద్యం విను.

అది స్వర్ణాంకితమైనకాల, మది మా
యాయంత్ర భూతాల నిం
త్రిదశల్ పాఱంగరాని కాలము, స్వతం
త్ర శ్రీ విలాసాలతో

అది (శ్రీ) భారతదేశ మన్యుల కసూ
యక్ గొల్పు కాలం బదే
మదిలోనండలపోయ దేహమున రో
మాంచంబు జన్మించెడిక్.

ప్రిభా:- నిజంగా రోమాంచ మౌతూంది దేహం. శతాబ్దాల నాఁటి స్వర్ణయుగాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించావు నీ కవిత్వంలో. హృద్యమైన నీ పద్యంతోఁ బాటు గేయం సాగించు. అది విశ్వప్రచారానికి సులభోపాయం. గేయంతోనే మన వస్త్రనిర్మాత వాటు సాగిపోతూంది. గేయంతోనే రైతుబాబు ఎండలో వానలో శ్రమను మఱచి వ్యవసాయం సాగిస్తున్నాఁడు. దేశ స్వాతంత్ర్యానికై పోరాటమొనర్చు మహా వీరున కది ఆవేశం పుట్టిస్తుంది.

(లోపల రాగాలాపము)

సుధా:- గేయం కావాలా? అదిగో! విను—చెల్లెలు పాడుతూంది.

(లోపల జయలక్ష్మి గేయము)

ఓ కళాజీవనా! ఓ వస్త్రకారా!
నీ కిదే నా జోత నేఁడు నైకోర! ॥ఓ క॥

ఇల్లాలు నీ ముందు ఎడబాయకుండ
పిల్లజల్లా నీదు కళ్ళముందుండ
చల్లఁగా నీవాటు సాగింపుమోయి!
మెల్లఁగా నీ వాటు మొనలింపుమోయి! ॥ఓ క॥

చిన్నారి పొన్నారి చీరెల న్నేసి
కన్నె చెల్లెంపకు కానుక లీ వోయి!
అన్నయ్యా! నీ దీక్ష అభిమానరక్ష
చెన్నొందు నీ వీక్ష శ్రీ కళాభిక్ష ||ఓక||

ప్రభా:- ఆహాహా! ఏమి గేయం! సంగీతం స్వర్గలోకానికి తీసికొని పోతూంది. నీ గృహం స్వర్గఖండం నిజంగా సంగీత సాహిత్యాల సమ్మేళనం. అన్న వ్రాస్తాడు చెల్లెలు పాడుతుంది. నీ కలం నీ చెల్లెలి గళం సంఘసేవ కుపయోగపడాలి.

సుధా;- తప్పకుండ ఉపయోగపడుతుంది. నేను వస్త్రనిర్మాతల సంఘంలో పుట్టినందుకు ఏదో నాకు కవిత్వ మబ్బినందుకు నా కలాన్ని సంఘం కోసం వినియోగిస్తాను.

ప్రభా:- సరే. ఇం కే మైనా ఉన్నదా? నీ పద్యం.

సుధా:- ఉన్నది. పద్యానికి ముందు గద్యం. భారత సీమను స్వర్గసీమగా చేసింది మన చేనేత. మన కళాకారుని కళావికాసం దేశదేశాల కీర్తి విన్యాసాల రచించిం దా నాడు. భారతావని రత్నగర్భయై రాణించింది నాడు. భారతదేశాన్ని ప్రపంచాదర్శంగా చేసింది మనమే. భారతాంబను రంగారు బంగారు డోల్లో ఊపింది మనమే. పాశ్చాత్యమ దేశాలన్నింటికి నాజూకులు దిద్దిపెట్టింది మన నేత కార్మికుడే. భారతావి స్వాస్థ్యం మూడు పూలారు కాయలుగా భాసించిందా రోజుల్లో. నాటికి నేటికి తలపోసికొంటుంటే హృదయం కలంతోపాటు పదునెక్కుతూంది.

మణులే యిచ్చిరో? మన్ననల్ సలిపిరో?
మజ్జీనులకై మున్నుఁ గ్రై
కొని-ఆ రోజులలో కళారమకు ని
గ్గుల్గాత్ప్ర చేమగ్గపుం
బనివాఁడందటి కన్న భాగ్యమున కా
వాసంబు-నేఁ డక్కటా!
తనకన్నకై నిరుపేద కన్పడడుగా
దౌర్భాగ్య మే మందునో?

ప్రిభా:- నాఁటికి నేఁటికి మన చేనేత పరిశ్రమ ఉత్తర దక్షిణ ధ్రువాల తారతమ్యం. నేత కార్మికు లా నాఁడు కుబేరులై జమీందారులకే పెట్టుబడులు పెట్టుతూ పాలరాళ్ళతోఁ గట్టిన ప్రాసాదాల్లో స్వర్గసుఖా లనుభ వించారు. ఈ నాఁడు వాన కురిస్తే వరదలు గట్టే పూరిగుడిసెల్లో నిరుద్యోగాలతో నిరాహారాలతో నిలు వునా మాడి చస్తున్నారు.

సుధా:- (జాలిగా) మాడిచస్తున్నారు. నిలువునా మాడి చస్తు న్నారు.

జయ:- (ఆవేగంతో ప్రవేశించి) ఎవ రన్నయ్యా! మాడి చస్తున్నా రంటున్నావు?

సుధా:- ఇం కెవరు, మనమే, మనవారే, మన చేనేత జనం.

జయ:- మన వృత్తి యిలా అయిపోయిం దే మన్నయ్యా! తుకలు ముక్కలు చేసుకొన్నా డొక్కలు పూడేది కష్టమైపోయింది. పూవులమ్మిన వీధుల్లో కట్టె లమ్ము కొంటున్నాం. భారత ప్రతిష్ఠకే కారణభూతమైన మన పరిశ్రమ కీ గతి పట్టింది.

ప్రిభా:- బొగ్గుల కోసం పెరటిలోని కల్పవృక్షాన్ని తెగనఱకు కొన్నట్లయింది.

సుధా:- బిడ్డ చచ్చినా పురిటికంపు పోలే దన్నట్లు మిల్లుల్ని తెచ్చి మన నెత్తిన కుద్దిన తెల్లదొరలు మన దేశా న్నుండి నైదొలఁగినా మిల్లుపోటీతో మనకు సతమతం తప్పలేదు.

ప్రిభా:- తప్పదు. మిల్లుపోటీ ఉన్నంతకాలం మన పని కన్ను బొమ్మల మీఁది వెండ్రుకలవలె ఎదుగూ బొదుగూ ఉండదు సరిగదా! నానాఁటికి తీసికట్టే.

సుధా:- మిల్లుపోటీ లేనినాఁ డీ దేశ మెంత బాగుండేది. ముప్పదిమూఁడు కోట్ల ప్రిజల్లో మూఁడు వంతులు కుటీర పరిశ్రిమల మీఁదనే ఆధారపడి తమ జీవితాలను హాయిగా-స్థాయిగా గడుపుకో గలిగారు. ఆ నాఁ డీ ఆఁకటిమంటలు ఆత్మహత్యలు మచ్చుకైనా కను పించాయా? దేశంలో. రామరాజ్యమన్నా-స్వర్గరాజ్య మన్నా అదే అక్షరాలా.

కవ్వ మాడని యిల్లు-కదురు త్రిప్పని కాంత
గార్దభాల ఏమూల గానరాదు
మగ్గముండని ఊరు-మగులు తానని పేట
ఎచ్చోట మచ్చుకు కేని లేదు
వ్యాపారలక్ష్మికి-వ్యవహార లక్ష్మికి
గోవుమాలక్ష్మికిఁ గొదువ లేదు
పైడిరాసుల పెంపు-పైరుపచ్చల సొంపు
భారతావని లోటు పాటు లేదు

గృహపరిశ్రమ లా నాఁడు వృద్ధిపొందె
లేమిడులు చూతమన్నను లేనెలేవు
శాంతి సౌఖ్యము లా నాఁడు స్థాయిపడియె
స్వర్ణ యుగమది భారత స్వర్గపథము.

జయ:- అది స్వర్ణయుగం. ఇది యంత్రయుగం. మింటికి నేడలు గట్టుకొంటూన్న విజ్ఞాన పురోగమనంతో మెతుకులనిచ్చే మేటి వృత్తుల్ని నాశనం చేసికొంటూంది మానవలోకం, చెట్టును గొట్టి మీఁదికిఁ దెచ్చుకొన్నట్లు.

ప్రభా:- కుటీర పరిశ్రమలు కూఁకటి వ్రేళ్ళతో కూలఁద్రోయఁబడి బ్రతుకు తెరువుల్లేక గ్రామికజనం ఏ యూర - ఏ యింటఁ జూచినా ఆఁకటి ఆక్రందనాలతో అణగారిపోతూంది. అభిమానాన్ని చంపుకొని అడుక్కొని తింటూంది. అన్నం పెట్టలేక కన్న బిడ్డల్నే అమ్ముకొంటూంది. దుర్భర పరిస్థితుల్లో ఆత్మహత్యలకు తలొగ్గుతూంది.

సుధా:- ఎక్కడ చూచినా దరిద్రదేవతా వికట తాండవాలే - ఎచ్చట గాంచినా మృత్యుదేవతా విలయ విహారాలే- ఎందు విన్నా నిరుద్యోగ పిశాచ వికృతాట్టహాసాలే - దుర్నివారం ! దుర్నిరీక్ష్యం ! దుర్భరం !

జయ:- ఈ యంత్రభూతాల కరాళదంష్ట్రల్లో చిక్కి శిథిలమై పోవలసిందేనా మన చేనేత. దీని అభ్యుద్ధరణానుకు మరేమి దారీ తెన్నులు లేవా ?

సుధా:- ఉన్నాయి, దారి తెన్నులు గాలి మేడల చిటారిశిఖర భాగాలలో - ఎండమావుల గర్భాల్లో దాక్కొని.

వాటికే మన చేనేత నాయకులు ప్రాకులాడుతున్నారు.
భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు.

జయ:- అదేమిటన్నయ్యా ! మన నాయకులు పడే పాట్లన్నీ నిష్ఫలములేనా ? శ్రమకోర్చి-నిస్వార్థ బుద్ధితో - ఇళ్లూ వాకిళ్లూ-ఆలు బిడ్డల్నీ మఱచి కష్టపడి పనిచేస్తున్నారే? ఆ శ్రమంతా...

సుధా:- నిష్ఫలం కాదు. ఫలిస్తుంది. కాలం కలిసి రావాలి.

జయ:- ఇంకెప్పుడు కలిసి వచ్చేది? సత్యాగ్రహాలుసాగించారే? ప్రాయోపవేశాలు కూడ కావాలా ?

ప్రభా:- ఏమో-మనకు రాష్ట్రం ఊరకనే వచ్చిందా ? శ్రీరాములుగారి పూర్ణాహుతి కాని దే. ఈ స్వతంత్ర భారతంలో కుటీర పరిశ్రమల్ని సరిదిద్దు కొందామని ఆశించాం - కలలు గన్నాం - పూజ్యబాపూజి శ్వేతముఖుల చేతుల్లోనుంచి దేశాన్ని నూలు పోగుతో లాక్కొన్నాడు. ఆ నూలు పోగుతోనే రామరాజ్యాన్ని నిర్మించాలని ప్రతిపదికలు రచించుకొన్నాడు. దురదృష్టం మన కాయన్ని దూరం చేసింది.

జయ:- దరిద్రుని తలగడుగులకు వడగండ్లవాన! మన దౌర్భాగ్యం కాకపోతే ఇంతలోనే మన కాయన దూరం కావాలా ?

ప్రభా:- గాంధిగారు పోయారు - గాంధేయమత మొంతవరకనుసరింపఁ బడుతుందో యిఁక. మిల్లులకీ చేనేతకీ ఒక పరిష్కారమార్గం కుదరాలి మిల్లు యజమానులా? కోటీశ్వరులు. నేత కార్మికులా ? నిరుపేదలు.

సుధా:- చేనేతవాళ్ళం రెండుకోట్లమంది మున్నా - మిల్లునేత కార్మికులు కొన్ని వేలమంది అయినా వారి నోటి దగ్గర కూడు మనకు పెట్టమంటున్నామా ? మనం మన పొట్టలు నిండితే చాలనుకోవటం లేదే ? హిరణ్యాక్షు వరాలు మన మేమీ కోరటం లేదే ? మిల్లులకూ - చేనేతకూ కొన్ని రకాలు ప్రత్యేకించ మంటున్నాం. చేనేతకు చట్టరీత్యా శాశ్వత రక్షణ చూపించమంటు న్నాం. మన నాయకులు దీనికి ప్రాకులాడుతున్నారు. ప్రాధేయపడుతున్నారు, ప్రభుత్వం ఇదిగో అదిగో అని సమాధానాలు చెప్పతూంది.

జయ:- సమాధానాల్తో నిరుపేదల పొట్టలు నిండుతాయా ? ఈ ప్రజారాజ్యంలో మిల్లులకూ - చేనేతకు ఒక పరిష్కారం కుదర్చమంటూన్న యీ కనీసవాంఛ నైనా చేనేతవారు నోచుకోరా ?

ప్రభా:- ప్రభుత్వ మీ విషయంలో స్పష్టతమాని తరణోపా యం కల్పించాలి.

సుధా:- ప్రభుత్వంలోని యీ స్పష్టతమాన్ని దాన్ని ఒకమార్గా నికి త్రిప్పుకోవాలన్నా అది మనలోనే ఉంది. అడగనిదే అమ్మ అయినా పెట్టదన్నట్లు మన జీవిత సమస్యా మార్గాన్ని సులభంగా పరిష్కారం చేసికోవాలంటే ప్రభుత్వాన్ని ఐక్యకంఠంతో మన మొత్తిడి చేయాలి.

ప్రభా:- అందు కైకమత్యం ముఖ్యావసరం. విద్యావాసన తక్కువైన ఫలితంగా మన వర్గాల్లో ఐకమత్యం చాల తక్కువ ఐకమత్యం లేనిదే మన మేమీ సాధించలేము.

సుధా:- ఐక్యత, ఆటంబాంబు మొదలైన మహామారణాయుధాలకంటె సునిశితమైన సుదృఢమైన ఆయుధం. యీ ఆయుధాన్ని శాంతి పోరాటంలో పోరాటాన్ని సల్పటానికి జాతీయంగా మనకు పూజ్యబాపూజి యిచ్చిపోయాడు.

ప్రిభా:- అవును. అదే మనకు వారసత్వమైన ఆయుధం. ఆ ఆయుధంతోనే శాంతి పోరాటాన్ని సాగిస్తాం. నిజంగా ఐకమత్యం లేనిదే ఏ జాతిగాని ఏ దేశంగాని ముందుకు పోజాలదు, కుల మత వైమనస్యాలనే మహా పర్వత పంక్తుల కైకమత్యమే శతనిధార - అదే అస్వాతంత్రమనే మహాటవి కగ్నికీల - స్వాతంత్ర్య సౌధారోహణమున కదే సోపానం - సత్యాగ్రహ సమరాల్లో జాతీయ వీరున కదే అద్వితీయమైన అప్రతిహతమైన అనివార్యమైన ఆయుధం.

సుధా:- ఈ ఆయుధాన్ని మనం సుదృఢం చేసికొని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తాం. మన నాయకులకండ దండగా నుండి పోరాడుదాం. ఇదే నా దృఢ దీక్ష.

ప్రిభా:- ఎన్ని కష్టాలు వచ్చినా-ఎన్ని అవాంతరాలు సంభవించినా-మన ఆశయాలు సిద్ధించే పర్యంతం నే నిద్రపోను. ఇదే నా దృఢసంకల్పం.

జయ:- మా మహిళాలోకంలో చేనేత వస్త్రధారణపై అభిమానాన్ని రేకెత్తించి, భారత చేనేత రక్షణకు భారత స్త్రీలే మూలకందములని ప్రచారం చేస్తాను. ఆంధ్రమాత పాదాల సాక్షిగా ఇదే నా ప్రతిజ్ఞ.

---

# రెండవ రంగము

(సుబ్బరాజు మేడ)

(ఆ మేడలో అదొక గది అ గదిలోనే ఇనప్పెట్టె ఒకమూల కనపడు తూంటుంది. లక్షాధికారి సుబ్బరాజు అటూ యిటూ పచారులు చేస్తుంటాఁడు. ఆయన వేషం లోభితనాన్ని కొంత సూచిస్తుంది. వ్రాఁతబల్లపై పుస్తకాల్ని పెట్టుకొని గుమాస్తా గోవిందు లెక్కపని చూచుకొంటుంటాఁడు.)

సుబ్బ:- కాకుల్లవంటి లోకులేం కూసుకొన్నా? కూడబెట్టడంలో సాటంటావా? గోవిందూ!

గోవిం:- సాటికాదంటాను. కోటి అబద్ధాలాడినా కూడఁబెట్టిన వాఁడేనండీ! ఘనగాఁడీ రోజుల్లో.

సుబ్బ:- ఈ రోజుల్లోనే కాదు. ఏ రోజుల్లోనూ అంతే. డబ్బు విషయంలో అబద్ధమాడినా తప్పులేదని శుక్రాచార్యుల వారీ నాఁడన్నాఁడా?

గోవిం:- డబ్బంటే యేమిటో అర్థం చేసికొన్న పెద్దమనిషి ఆయ నొక్కఁడే. పేదల రక్తాన్ని పిడిచికొని త్రాగేవాళ్ళని ధనికుల్ని తెగ ఆడిపోసికొంటుంది లోకం! గుడ్డిలోకం!

గోవిం:- లోకం గుడ్డిలోకం నిజంగా—అసలు లోతుకుపోయి చూస్తే దేశానికి కళాకాంతులు దిద్ది తీర్చేవాళ్లు ధనికులే ఎట్లంటావా? మన దేశం పారిశ్రామిక దేశం ధనికుల పెట్టుబడుల మీఁద నడుస్తాయి. మిల్లుల్లో—మరి యితర

వ్యాపార సంస్థల్లో కోట్లమంది కూలిజనం బతికిపోతు న్నారు.

గోవిం:- దేశం నిజంగా ఈ మాత్రమైనా కళావంతమైయున్న దంటే ధనికులుండబట్టే. లేకపోతే పనిపాటలు లేక ప్రజలు సోమరిపోతులై అడుక్కొని తింటుంటే దేశం దరిద్రదామోదరుడికి నిలయమైపోయేది.

సుబ్బ:- ఈ కీలకం తెలియక వెధవలంతా మిల్లులు నశించాలి. ధనికులు నశించాలని ఒకటే నినాదాలు.

గోవిం:- వీళ్ళ మొగం. వీళ్ళ నినాదాలున్నా, వీళ్ళున్నా. విదేశాల్లో మిల్లు పరిశ్రమను పెంపొందించుకొని మింటికి మేడలు గట్టుకొంటుంటే యీ దేశంలో మిల్లులు నశిం చాలంటున్నారు.

సుబ్బ:- ఇల్లువిప్పి పందిరి వేయమన్నట్లున్నది మనవాళ్ళ తెలివి.

గోవిం:- పోనీలెండి! ఎవరే నినాదాలు చేసుకొన్నా డబ్బున్న వాళ్ళకీ రోజుల్లో డబ్బుల్ని పోగుచేసుకొనే మార్గాలు లేకపోతాయా?

సుబ్బ:- ఎందుకు లేవు. డబ్బుండాలేగాని పిల్లల్ని పెట్టించవచ్చు. కోడిపిల్లల్లాగ డబ్బుల్ని. నిజానికి కూలి ప్రజలేగోవులు ధనికులే గోపకులు.

గోవిం:- పూర్వజన్మలో ఎక్కువ పూజ చేసుకొన్న వాళ్ళంతా ధనికులై పుట్టితే తక్కువ పూజ చేసుకొన్న వాళ్లు పేదలై పుడతారు. ఇదంతా కర్మఫలమండీ! కర్మఫలం! చేసు కొన్న వాడికి చేసుకొన్నంత మహాదేవ.

సుబ్బ:- మరేమనుకున్నావు. ధనికుల్ని తిట్టిపోస్తారుగాని వాళ్ళు పూర్వజన్మలో పెట్టిపుట్టిన వాళ్ళు. ధనికులూ, ధనం

లేని దేశం ఏ దేశం తగలబడ్డ దేశం. అసలు కీలకం తెలియక పిచ్చిముండాకొడుకు లిలా పడిపోతున్నారు గాని, దేశంలో ధనికులూ-పేదలూ ఇద్దరూ ఉండవలసిందే. వీళ్ళ సామ్యవాదం వీళ్ళూ పాడుగాను! దేశంలో అంతా ధనికులే అయితే ధనానికేం విలువ? అయినా అదెలా సాధ్యమంట! దేవుడి సృష్టిలోనే లేదే తగలఁబడి సామ్యం. మానవ సృష్టిలో సాధ్యమా? ప్రకృతి విరుద్ధమైనమాట తాకపోతే అదెక్కడ? అయ్యేదా? చచ్చేదా?

గోవిం:- అనుభవంగల మాటలంటే మీవి. బాగ చెప్పేరు! దేశంలో అందఱూ ఒకే విధంగా ఉండాలనే వాదం నిజంగా పిచ్చివాదం. పనిపాటలకు బద్ధకించే బడుగు సన్యాసులంతా ఉన్నవాళ్ళ దగ్గర పంచుకొని తినే యోలని చూస్తున్నారు.

సుబ్బ:- (ప్రక్కకు చూచి) ఎవరా వచ్చేది?

గోవిం:- రాముఁడండి! మన పనివాఁడు.

రాముఁడు:- (ప్రవేశించి) దణ్ణం బాబయ్యా!

సుబ్బ:- ఏఁరా రాముఁడూ! ఎందుకు వచ్చావు? నీ వాలకం సూస్తే చూస్తే ఏదో ఎత్తు ఎత్తుకొని వచ్చినట్లున్నావే?

గోవిం:- ఆ మొగం వేలవెయ్యడం-ఆ చేతులు నలుపుకోవడం. అదంతా చూస్తే ఏదో అడగవచ్చినట్లున్నాఁడు.

సుబ్బ:- (నవ్వి) ఏముంది అడగటానికి వాఁడి మొగం.

రాము:- ఏంలేదు బాబయ్యా! ఏదో ఇన్నాళ్ళుబట్టి శాకిరి సేత్తుండా - నఁటి నా సంగతి తేల్చలేదాయె.

సుబ్బు:- నీటిలోనా? ఏటిలోనా తేల్చేది. చెప్పు. ఏం తేల్చాలో నీ సంగతి.

గోవిం:- చెప్పరా రాముడూ! వెనకాడతావేం? నీ సంగతేదో బయటికి వెళ్ళబెట్టు.

రాము:- జీతం సంగతి బాబయ్యా!

సుబ్బు:- (చిరాకుతో) జీతం! జీతం సంగతి తేల్చకపోతే నీకేం జీవించలేవా యేరా?

రాము:- జీవించటానికి అదేగదాండి! ఆదారం.

సుబ్బు:- ఏం కాస్తో కూస్తో చాకిరి చేస్తున్నావు. ముప్పూట పొట్టనిండా పెట్టి మేపుతున్నాం పందెం గుఱ్ఱంలాగ. వాళ్ళ వీళ్లకుమల్లే చద్దో? బొద్దో? ఇంత మొగాన్నే సేది కాదే మా అమ్మాయి వేడి కూళ్లూ, వేడి కూర లేగాని.

రాము:- నిజం బాబయ్యా! ఆ యమ్మ బీదోళ్లపాలిట అన్నపూర్ణమ్మ. బీదా బిక్కీని సూత్తే ఆయమ్మ కళ్ళల్లో నీలాలు జాలువారతాయి. ఆయమ్మ పెద్దైవదు కాదంటాను. అయితే నా వక్కడి పొట్ట పూడితే సాలంటారా?

సుబ్బు:- ఈ రోజుల్లో పొట్టకూడు దొరికితే అదే పదివేలు. కాకపోతే నీ వడిగేది ఒంటిమీదికి గుడ్డ. ఓ నెలాగు ఇప్పుడిప్పుడే చినుగు పడుతున్నాయి మా చెమటకు మాగినవి ఏ రెండో మూడో పారేస్తాను.

గోవిం:- పాపం! రాముడు పట్టి అమాయకుడండీ!! మిమ్మల్ని అర్థం చేసుకోవటం లేదుగాని వాడికేం తక్కువ ఏదో కాస్త చాకిరి చేస్తూ మీ యింట్లో బిడ్డలాగ బ్రతికి పోవచ్చు.

రాము:- నే నొక్కణ్ణయితే అలాగే అనుకొనేవాణ్ణి. మరి నా పెళ్లాం-పిల్లా-జల్లా బ్రతకొద్దా? బాబయ్యా!

సుబ్బ:- ఏం వాళ్ళపాటికి వాళ్ళు చాకిరి చేసుకొని పొట్టపోసుకోవటంలే? కాళ్ళూ-చేతులూ లేనివాళ్లా? నీ మీఁదే ఆధారపడ్డానికి.

రాము:- కానీ, ఆడదాన్ని పొరుగింటికాడ పనికుంచటానికి నా మనస్సొప్పటంలేదు బాబయ్యా! ఏ చిన్నమాటొచ్చినా మానం పానం ఎగిరిపోతుంది.

సుబ్బ:- నీ పెళ్ళాం అటువంటిదేం కాదుగదరా!

రాము:- ఇప్పటిక్కాదు. ఈ పాడు సినీమాలొచ్చాక హద్దూ పద్దూ పోయింది. ఎవళ్ళకే వేళకు ఏం బుద్ధి పుడుతుందో? ఎవరు చెప్తారు. దీపం ఉండగానే సక్కపెట్టుకోవటం మంచిది బాబయ్యా!

గోవిం:- రాముఁడు చెప్పేది కూడ నిజమేనండోయి! వాఁడు చదువు సంధ్యలేని మొఱకుమనుఁడా కొందుకైనా వాఁడి బుద్ధిలో మంచి లోకానుభవముంది.

సుబ్బ:- కానీ, రాముఁడి మాటలు రామాయణకాలం నాఁటికి సరిపోతాయేమో కాని, ఇప్పుడు సరిపోవు. ఈ రోజుల్లో రెండుపక్షులూ తెక్కలాడిస్తేనే డొక్కలు పూడేది లేకపోతే కడుపులు మాడ్చుకోవలసిందే. పోనీరా రాముఁడూ! నీ పెళ్లాన్ని కూడ మా యింటి దగ్గరనే ఉంచు-ఏదో ఆ పనీ యీ పనీ చేసిపెట్టుతుంటే యింత కూడూ గుడ్డ యిస్తాగ.

రాము:- నా పెళ్లాన్నుంచితే పిల్లలో?

సుబ్బ:- తల్లితోటే పిల్లలూనూ.

రాము:- (కష్టంగా) ఒద్దు బాబయ్యా! ఎవరింటిదగ్గరా నా పెళ్లా న్నుంచను బాబయ్యా! ఏదో నా కింత జీతంయిూర్రావుకు సేత్తే దాంతోనే మా పిల్లలూ మేమూ కలో, అం బలో కాచుకోని తాగుతాం.

సుబ్బ:- అయితే జీత మేమియ్యమంటావురా !

రాము:- (చేతులు నలుపుకొంటుంటాడు)

గోవిం:- చెప్పవోయ్ ! నసుగుతా వెందుకు? చెప్పు పెంద ళ్లాడె ఎంతియ్యమంటావో జీతం.

రాము:- కామరాజు బాబయ్యగారు నా శాకిరిసూసి ముప్పై ఇత్తానన్నారు.

సుబ్బ:- (చిరాకుగా) రూపాయలా ? పెంకులా ?

రాము:- (మొగం చిట్లించుకొని) ఇత్తారు పెంకులు. రాతిరీ పొగులూ తెక్కలూడేట్టు శాకిరి సేత్తే మాకు పెంకు లిత్తారా బాబయ్యా ! నిజానికి మీ కోపం వత్తుందే మో కాని. మా బీదోళ్ళ సెమటతోనే కట్టారు కదాండి! మారాజులు మేడలూ-మిద్దెలూ.

సుబ్బ:- ఆఁ మీ చెమటతోనే కట్టాముదా మేడలు మిద్దెలు. మాదే మున్నది, అంతా మీదే. మా మూలాన మీరు బతికటంలే. మీ మూలానే మేము బతికి పోతున్నాము. ఎప్పుడు నేర్చుకొన్నావురా యీరాజ కీయం.

రాము:- అదేమంటే రాసకీయమంటారు. మాకేం రాసకీయం తెలుసు బాబయ్యా! ఉండమాటంటే ఉంమూరచ్చిరా దంటారు మాయ మర్మాలు తెలీనోళ్ళం అనేశాత్తాం ఉండదున్నట్లు అడచుకోలేం కడుపుల్లో. నిజానికి శాకిరి

సేత్తేయిత్తున్నారుకాని, మాకేం దానా దర్మం యిత్తు
న్నారా ? బాబయ్యా !

గోవిం:- నేర్చేవోయి మాటలు.

సుబ్బ:- నేర్చాడు మాటలు, వెజ్జివెధవ. అయితే ముప్పైకి
తగ్గుదురా నీ బేరం ?

రాము:- మీకైతే పాతిక్కూంటా. సత్తెవతమ్మ ఏ మంచి
సేసుకొన్నా నాకు ప్పెట్టందే ఊరుకోదు మా తల్లి. ఆ
తల్లిని సూత్తేనేసాలు, మా కడుపులు నిండిపోతాయి.
పారేయండి నా మొకాన పాతిక రూపాయలు ఎంత
పనైనా సేశాత్తా.

సుబ్బ:- అమ్మయ్యో! పాతిక రూపాయలే! నీ బుజ్జిలో వర్తక
సరళిని తలదన్నే ప్లానులున్నాయిరా రాముడూ !ఇలా
పదేళ్ళల్లో కొన్ని వేలు పోగుచేసి ఒక పెద్దమేడ కట్టిం
చుకొని ఆ మేడ పై అంతస్తులో నీ పెళ్లాం-నీవూ కులు
కుదా మనుకొన్నావటగా !

రాము:- మా మొకం, మా కెందుకులే బాబయ్యా! మేడ
లూ-మిద్దెలూ. మాకా పూరి గుడిసెలు సాలు.
మీరుండండి మేడల్లో. పంచబక్ష్యపరమాన్నాలు
మీరు తినండి బాబయ్యా! మాకా నూకలు కూడుం
టే అదే సాలు. సీని సీనాంబరాలు మీరు కట్టుకోండి!
మాకు మీ సెమటకు మాగిన చింకిపేలికలు సాలు.
ఉప్పుడిన్న కొద్దీ దప్పి కెక్కువ. మాకెందుకులేండి !
బాగ్గేలు బోగ్గేలు.

గోవిం:- ఉపన్యాసం దంచేస్తునాడే రాముడు.

సుబ్బ:- ఉపన్యాసం! ఒరే అబ్బీ! ఒక్కటే మాట. ప్రొస్తుకూటికి కుంటావా? ఉండు. లేకపోతే పనివాళ్ళకి జీతాలిచ్చుకోవటానికి రూపాయలు చెట్టున గాయుటం లే.

రాము:- రూపాయలు గాసే చెట్లుంటే బీదా బిక్కీ ఇట్టెందుకవత్తపడాలి. పోనీండి. మరో మారాజునాశించుకొంటా.

సుబ్బ:- పోరా-పో-ఇప్పుడే పో- మాకు నీ పనీవద్దు. గినీవద్దు.

రాము:- (బావురుమని యేడుస్తు) పోతాను-ఇప్పుడే పోతాను. దేశంలో బీదోళ్ల గోడ డవిగోడయింది. బీదలకి మంచిరోజుల్లేవు. పోతున్నా (ఏడుస్తుపోతాడు)

సుబ్బ:- చూచావా గోవిందు పనివాళ్ల పని యెంత పైకిపోయిందో? నోరులేని అమాయకులీనాడెంత నోరు సంపాదించుకొన్నారు?

గోవిం:- దీనికంతా ఆ సుధాకరరావు వత్తాసిలేండి।

సుబ్బ:- వెధవలంతా ఆ కవిగాడి మాటల్లో పడిపోతున్నారు.

గోవిం:- కవిగారి తిక్క కొంత కుదిరిస్తే బాగుంటుంది.

సుబ్బ:- కుదురుస్తా తిక్క. ఆతడి జుట్టు మన చేతిలో లేకపోలేదు. తండ్రినాటి బాకీ డిక్రీ అయ్యే ఉన్నది. దాంతో ఆస్తి జప్తు చేయిస్తాము. మరేదో అభాండం కల్పించి వాణ్ణి అరెస్టు సైతం జరిగించుతాము. ఆ పరాభవంతో గాని మళ్ళీ నలుగురిలోకి తలెత్తుకొని రాకుండాపోతాడు.

గోవిం:- కుక్కకాటుకి చెప్పుదెబ్బ. దానితో కవిగారి బ్రతుకు తేలిపోతుంది. పోలీసువాని చేతిలో నాల్గు రూపాయలు తగలేస్తే ఎంతపనైనా జరుగుతుంది.

సుబ్బ:- డబ్బుకు దాసుళ్ళుకాని వా రెవరు గోవిందు ! డబ్బుం టే కొండమీంది కోతి దిగిరాదూ ?

గోవిం:- ఆ పేరయ్య ఒకండు. "మ్రింగటానికి మెతుకు లేక పోయినా మీసాలపై సంపంగి నూనె" అన్నట్లు తిండికి లేకపోయినా తెగనీల్గుతాండు. మిల్లులు నశించాలనే వాళ్ళల్లో ఆ నునొక మెంబరు.

సుబ్బ:- సమయంలో జ్ఞాపకం చేశావు. వాండి తాకట్టుబాకీ మూండేళ్ళయిందో లేదో చూడు.

గోవిం:- (గబగబా లెక్కలు తిరగేసి చూచి) మూండేళ్ళు మొన్నటితోనే సరి—

సుబ్బ:- ఇంకేం, వాండి కర్మకాండ కూడ తొందరలోనే ఉన్నది. ఇల్లు ఖాళీ చేయించి స్వాధీనం చేసు కొంటాము.

గోవిం:- ఈ దెబ్బతో ఊళ్లో కుక్కిమిక్కనేవాళ్లు లేకుండా పోవాలి. అలుగుటయే యెఱుంగని ధర్మరాజులు మీరు. మీరు అలిగితే యీ ఊళ్లో మన గలిగే దెవరు?

సుబ్బ:- కాకపోతే కొండతోనా ? పొట్టోళ్లు క్షీకొనేది ? చూడు ఆ సొంతం ఈ తొత్తులు పడేపాట్లు.

గోవిం:- సరే. మీ దుష్టశిక్షణ శిష్టరక్షణ కార్యక్రమానికి ప్రారంభోత్సవ మెప్పు డంటారు ?

సుబ్బ:- ఎప్పుడో యెందుకు రేపే.

గోవిం:- అయితే, జరూరుగా పనులు సాగాలి.

సుబ్బ:- సాగాలి నిజంగా. వేళయింది. నీవు భోజనం పని ముగించుకొని తొందరగా రా.

గోవిం:- చిటికెలో వస్తాను. (వెళ్లును)

# మూడవ రంగము

సుధాకరరావు గృహము

(పంచలో రెండు కుర్చీలు వేయఁబడి ఉంటాయి.)

సుధా:- (ఆలోచనగా అటూ యిటూ పచారులు చేస్తుంటాఁడు.)

ప్రభా:- (ప్రవేశించి) ఏమోయి సుధా! ఎందుకు కబురు చేశావు?

సుధా:- రా, కూర్చో. (ఇద్దఱు కూర్చుంటారు.) పరిస్థితులు మఱీ విషమించి పోతున్నాయి. పోయిన రోజుల కంటే వచ్చే రోజులు చాల గడ్డు రోజుల్లాగున్నాయి. మన చేనేత సమస్య తొందరలో పరిష్కారం కాకపోతే ఈ వర్గానికి మోక్షముండదు.

ప్రభా:- ఆఁకలి యాత్రలు సాగించాము. సత్యాగ్రహాలు జరిగించాము కానీ, ప్రభుత్వ యంత్రాంగంలో మార్పు రాలేదు.

సుధా:- ప్రభుత్వ మేనాటికైనా మిల్లుల్ని తగ్గించి చేతి వృత్తుల్ని ఉద్ధరించకపోతే దేశంలో నానాఁటికీ పెచ్చు పెరిగి పోతూన్న నిరుద్యోగ సమస్య నివారణకాదు.

ప్రభా:- ఆ మధ్య యుద్ధసమయంలో మిల్లుల్లో పనితగ్గిన మూలాన చేనేత వస్త్రాలకు ఆవశ్యకత పెరిగింది. కాని,

నూలు కఱవుల వలన మగ్గాలాడక మాడి చచ్చింది చేనేత జనం! ఇప్పుడు నూలులభిస్తూంది. కాని, ఏమి సుకం! మిల్లుబట్టల పోటీలో చేనేత బట్టలను కొనే దిక్కులేక పోయింది. స్థూలంగా చూస్తే మిల్లులున్నంత కాలం చేనేత కోలుకోనేట్టులేదు.

సుధా:- ప్రభుత్వ మీ విషయంలో నిష్పాక్షిక దృష్టి చూపించాలి. కోటీశ్వరులైన మిల్లు యజమానుల్ని ఏ కొద్ది మందినో దృష్టిలో పెట్టుకొంటే కోట్లాదిమంది నోట్లో మన్ను గొట్టినట్లౌతుంది. ఒక్క మిల్లు యజమానులేనా? మిల్లుల్లో పనిచేస్తూన్న వేలాది కార్మికజనం లేదాఅంటే వాళ్ళ స్థితిగూడ అర్థాన్నంతో అధ్వాన్నంగానేఉన్నది.

ప్రభా:- అవును. ఆ మధ్య మిల్లు కార్మికులు డెబ్బదైదు రోజులుగా సుదీర్ఘంగా సమ్మె జరిగించారంటే అర్థమేమిటి?

సుధా:- ఈ మిల్లుల మూలాన ఒక్క మిల్లు యజమానులకే దర్జాబ్బణాలకాని కార్మికులకే ముంది? ఇచ్చట మన వాళ్ళు స్వగృహాల్లో ఆలుబిడ్డ లెదుటనుండగా తెక్కలాడిస్తూంటే-అక్కడ మిల్లుల్లో కార్మికులు ఆలుబిడ్డలకు దూరమై తెక్కలాడిస్తున్నారు. ఆ విధంగా చూచుకొంటే చేనేత కార్మికుని జీవితంకంటె మిల్లు కార్మికుని జీవితంలో మెఱుఁగేమీ లేదు.

ప్రభా:- ఇంతమాత్రము దానికి మిల్లులపై అభిమాన మెందుకు? ప్రభుత్వానికి. మహాత్ముని ఆశయాలదృష్ట్యా కుటీర పరిశ్రమల్నే ఉద్ధరించుకొంటే దేశంలో నిరుద్యోగ సమస్య సులభంగా పరిష్కారమై పోతుందే? దేశంలోని ప్రతి ఒక్కనికి చేతినిండా పని కడుపునిండా

తిండి లభిస్తుందే ? ప్రభుత్వ మీ విధాన మెందు కనుస రించఁగూడదు ?

సుధా:- ప్రభుత్వ మిక్కడే తొక్కిటలాడుతూంది. కుటీర పరిశ్రమల్ని ఉద్ధరిస్తామని వేదికలపై ఉపన్యాసాలు చెప్పుతున్నారేకానీ, చేతల్లో లేదు.

ప్రభా:- దీనికి కారణం ప్రభుత్వోద్యోగుల్లోనే చాలవరకు లోపం కన్పిస్తూంది. నిస్వార్థబుద్ధితో సరియైన వాస్త విక విషయాల్ని ప్రభుత్వాని కందించటంలేదు. మన చేనేత ప్రజలు ఆఁకటి చావులు చస్తుంటే రోగాలచేత చచ్చినట్లు రిపోర్టుల్ని తయారుచేస్తున్నారు స్థానికోద్యో గులు. ఎక్కడో కూర్చుండి ఉన్న ప్రభుత్వానికి గ్రామసీమల్లోని ప్రజల పరిస్థితు లర్థం కావటం లేదు.

సుధా:- ప్రభుత్వమంటే నీ నా కుటుంబమే అనుకొని, యెంత వరకు నీ నా అక్కఱలనే చక్కఁజేసుకొంటుంటే యెలాగు ? విశ్వకుటుంబంగా భావించి విశ్వంలోని విశ్వ జనముల అక్కఱలను చూడాలి.

ప్రభా:- అట్టి విశ్వవిశాల దృక్పథాన్ని ప్రభుత్వానికి దేవుఁడు ప్రసాదిస్తే—వ్యక్తిగతమైన సంకుచిత భావాలు నశిస్తే, భారతదేశం స్వర్గసీమ కాదా ?

సుధా:- అందాక కలలు కంటుంటాము.

ప్రభా:- మాటల్లో పడిపోతున్నాం. భోజనమయిందా, యింతకు ?

సుధా:- ఇంకాలేదు.

ప్రభా:- ఏం ? వంటకాలేదా యింకా.

జయ:- (అందుకొని) వంట యెప్పుడో అయింది.

పరిభా:- ముందు భోజనం చేసిరా—కూర్చుంటాను. తరువాత మాట్లాడుకోవచ్చు.
సుధా:- సరే, కూర్చో. మూడు నిముసాల్లో ముగించుకొని వస్తాను. (లేచిపోబోవగా అప్పుడే సుబ్బరాజు, అమీనా, పోలీసు మొదలైనవారు ఎదురుగా వస్తారు. పరిభాకరరావు, జయ చకితులై చూస్తారు.)
అమీ:- సుధాకరరావుగా రెవరు ?
సుధా:- నేనే—ఇప్పుడేం వచ్చింది ?
అమీ:- కోర్టువారి ఉత్తరువు ప్రకారం నీఆస్తిని జప్తుచేసుకొనటానికి వచ్చాను. నేను అమీనాని.
పోలీసు:- నేను నిన్నరెస్టు చేసి తీసుకొని పోవటానికి వచ్చాను.
సుధా:- జప్తెందుకు ? అరెస్టెందుకు ?
అమీనా:- జప్తు మీ నాన్నగారి మీద చేయబడిన బాకీ డిక్రీ తాలూకు.
సుధా:- ఊఁహూఁ.
పోలీసు:- అరెస్టు సుబ్బరాజుగారిని నీవు ఖూనీ చేస్తానన్నందుకు
సుధా:- నేను సుబ్బరాజును ఖూనీ చేస్తానని అన్నట్లు ఋజువేమిటి ?
పోలీసు:- అది మాకేం తెలుసు. సుబ్బరాజుగారు ఫిర్యాది అయ్యారు. అందుమీదట మేము వచ్చాము. ఒకవేళ నీ వనలేదని అంటావా ? విచారణలో తెలుపుకో.
సుధా:- సరే, అట్లనే తెలుపుకొంటాను. దీనికంతకు మూలం మరేమో కాదు. ఈయన మిల్లు భాగస్థుడు ఈ ఊళ్లో మిల్లుల్ని వ్యతిరేకిస్తున్న వాళ్ళల్లో నేను ముఖ్యుణ్ణి. ఆ అక్కసు పట్టలేక యీ విధంగా ప్రతి

బాకీలను బయటికి దీసి, ఖూనీ చేస్తానన్నాఁడని అభాండాలకు, అఘాయిత్యాలకు పాల్పడి కొంపమీఁదికి తెచ్చి పెట్టాఁడీ పెద్దమనిషి. ఇటువంటివారే నేఁడు పెద్దమనుషులయ్యారు.

ప్రభా:- (అందుకొని) పెద్దమనుషులు—లోకుల కొంపలు కూల ద్రోయడానికి, దీపాలార్పడానికి, పేదలను పీడించటానికి పెద్దమనుషులు.

అమీనా:- ఏమిటండీ సుబ్బరాజుగారు ! వీళ్ళిలా మాట్లాడుతున్నారు ?

సుబ్బ:- వాళ్ళ మాటలకేమిలేండి ! మనపని మనం చూచుకొని పోదాం. పోనీ, ఇప్పుడైనా బాకీ చెల్లిస్తే జప్తు జరిగించముగా. అడగండి !

అమీనా:- ఏమయ్యా! ఇప్పుడైనా డబ్బుకట్టి బాకీ రద్దు పఱపించుకొంటావా ?

సుధా:- అమాంతంగా బాకీలు పీకల మీఁదికి తెచ్చి పెట్టితే యీ కానికాలంలో ఇప్పుడే ఎక్కణ్ణుండి తెచ్చికట్టేది? ఇంతకు కసిపోక మసిపూసికొనుట యిదంతా. కానీయండి ! ఆయన కోరికనే కొనసాగనీయండి ! ఆస్తి జప్తు చేయండి ! అరెస్టు చేయండి ! ఇంకేమైనా చేయండి ! వారిదెబ్బకు తిరుగులేదు.

సుబ్బ:- ఎందుకండి మనకీ విలంబనం ? జప్తుపని ముందు కానీయండి !

అమీనా:- ఏమయ్యా! మీ ఆస్తిని జప్తు చేసుకోమంటావా ?

సుధా:- చెప్పేనుగా—చేసుకోండని.

అమీనా:- వీరన్నా ! ఇంట్లో సామానులన్నీ బయట వేయి.

వీరన్న:- (కొన్ని సామాలు బయట వేసి రాట్నాన్ని తీయుచుండ)
జయల:- (అడ్డముపోయి యేడుస్తూ) అయ్యో! నా రాట్నాన్ని
గూడ తీసుకొనిపోతారా ?

ఈ రాటమ్మే కదా! ఏడుదీవులు దాట
సాఁగించు - పవిత్రగీతారవంబు
ఈ రాట్నమే కదా ! పారతంత్ర్యక్లేశ
శుష్కజాతికి నవజ్యోతిఁ జూపె
ఈ రాట్నమే కదా! హిందూ ముసల్మాను
హరిజన తారతమ్యాలు మాన్పె
ఈ రాట్నమే కదా! భారతి జనయిత్రి
కడగండ్లకుఁ - కడఁ గానఁ జేసె

ఈ వడకు రాట్నమే కదా! యీ స్వతంత్ర
భారత పతాక చిహ్నమై భాసురమగు.
తాత బాపూజి ఆరాధ్య దైవత మిది
జప్తు చేయుదురా ? దీని శ్వపచులార !

అమీనా:- వీరన్నా! పాపం! ఆఅమ్మాయి అంతగా ఏడుస్తుంది
ఆరాట్నాన్ని విడిచి పెట్టు.
సుబ్బ:- అమీనాగారు! రాట్నం విడిచిపెట్టడ మెందుకండి !
జప్తు చేదాం.
అమీనా:- వద్దు. మాతృద్రోహం. ఈ రాట్నం పూజ్య
బాపూజి ఆరాధించిన యిష్టదేవత. భారతమాత
దాస్య శృంఖలాలను త్రెంచివేసిందీ రాట్నమే. పవి
త్రమైన యీ రాట్నాన్ని జప్తు చేస్తే మహాత్ముని
దివ్యాత్మకు శాంతి ఉంటుందా ?

సుబ్బ:- మీ రిట్లా సెలవిస్తున్నారా? సరే, జప్తుపని ముగిసి
నట్లే. జమాన్‌గారు! ఇక మీ పని.
ప్రభా:- (పళ్లు కొరుకుతాడు.)
సుధా:- ప్రభా! ఆవేశాని కిది సమయం కాదు. శాంతిక్షాంతు
లీ సమయంలో అనుష్ఠేయాలు. మహాత్ముడీ పరమా
శయంతోనే గమ్యస్థానాన్ని సాధించాడు. నా కిప్పు
డిదొక అగ్నిపరీక్ష. ఇంతమాత్రాన నా మర్యాద
మంటగలిసేదిలేదు. లోకం మంచికి మంచిని, చెడుకి
చెడుని అనుకోకపోదు. ఈ హింసాకాముల బ్రతుకులు
బ్రద్దలయ్యే రోజులు రాకపోవు. తొందరెందుకు?
సుబ్బ:- పేదవాని కోపం పెదవికిచేటు (నవ్వును)
ప్రభా:- (తిరిగి వెక్కిరించి నవ్వును)
పోలీసు:- సుధాకరరావుగారు!
సుధా:- ఆఁ సిద్ధంగా ఉన్నా. ఇవిగో చేతులు. తగిలించు
నీ యినప గొలుసులు వీనికి. ఇవి చాలా పవిత్ర
ములు. భారత స్వాతంత్ర్యసంపాదనకై పలవించిన నా
యకుల హస్తాలు స్పృశించి ప్రశస్తమైనవి. తగిలించు
బేడీలు. ఇవిగో చేతులు. (చేతులు చాచును)

(అందరు నిర్వేరపోతారు. జనం బావురుమంటుంది ప్రభాకర
రావు కోపావేశాన్ని అభినయిస్తాడు. సుధాకరరావు వారిస్తా
డు. పోలీసు సుధాకరుని చేతులకు గొలుసులు తగిలిస్తాడు.)

సుధా:- (ఆవేశాన్ని పట్టలేక)

పేదల కప్పులు పెట్టి అమాంతంబు
పీకలపైఁ దెచ్చి పెట్టుమనుచు
లోకువగానున్న లోకుల నీరీతి
రట్టుల సాక్సేయు నట్టియునుచు

స్వాతంత్ర్యపరత్వాన - పరులనెత్తుకుపిండి
పొట్టలు పెంచుకొన్నట్టి యుసుకు
తాకట్లలో - కొంపలాకట్టుకొంచును
బీదసాదల వేడిపించు నుసుకు

కడచి బ్రతికితిమని తెగ గర్వపడుచు
వెనుక చూపది లేకయే విఱ్ఱవీఁగు
లుబ్ధనరరూప రాక్షస లోకములను
పిడిచికొని తాగిగదా ? బిడ్డబిడ్డతరము.

జయ:- అన్నయ్యా! జైలుకు పోతావా ? (ఏడ్చును)

ప్రిభా:- ఏడువకమ్మాయి! నే నుండి మీ అన్నయ్యను జైల్లో ఉండనిస్తానా? సాయంకాలానికే జామీనుమీద విడిపించుకొనివస్తాను. నీవేం భయపడకు.

సుధా:- (ఏడుస్తూనే ఉంటుంది.) జయా! ఎందుకమ్మా ఏడుస్తావు ? వెఱ్ఱిదానా! ఈ కష్టాలు మనకే రాలేదు. ప్రపంచానికంతటికీ పూజ్యుఁడైన గాంధీజీ యెన్నిసార్లో కారాగారవాస మనుభవించాఁడు. ఆయనకంటె మన మెక్కువా ? కష్టాలకు కర్మాలకు పర్యవసానం లేకపోలేదు. త్యాగానికి—ధైర్యానికి నీ హృదయంలో తావియ్యి. త్యాగ ధైర్యాలే మన జాతికి నీతికి ఖ్యాతిఁ దెచ్చాయి.

వీరతిలకమిచ్చి వెలఁది మాంచాలమ్మ
భర్తను పోరికిఁ బంపునాఁడు
వీరించి రెను మూసి విటిఁగిన తిక్కని
కోడలత్తయు - ఉసికొలుపునాఁడు

కాకతి రుద్రమ్మ ఘన భుజావేదిపై
జయలక్ష్మి పెండ్లిండ్లు జరుగునాఁడు
బొబ్బిలి దుర్గంపు ముట్టడిలో మల్ల
మాంబ నిప్పున బూదియైన నాఁడు

త్యాగధైర్యాలు రారాపు లందెనమ్మ!
తెలుగు దేశాని కీయవే వెలుఁగులమ్మ!
ఆంధ్రజాతి కివి పరంప రాగతమ్ము
లమ్మ! ఏలమ్మ! నీవు ధైర్యమ్ము తొలఁగ.

పోలీసు:- సరే, ఇఁక నడవండి బాబు!

జయ:- (బిగ్గరగా ఏడుస్తుంది)

సుధా:- (పోలీసు వెంట వెళ్లును)

సుబ్బ:- వీరన్నా! జప్తుసామానులు బండి కెక్కించు.

వీరన్న:- అట్లనే.

జయ:- (ఏడుస్తూంటుంది)

అమీనా:- (వెఱఁగుపడి చూస్తుంటాఁడు.

(తెరపడును.)

---

# నాలుగవ రంగము

పేరయ్య పూరిల్లు

(వానకొరిస్తే వరదలుగట్టే ఆపూరిల్లు పేరయ్య దారిద్ర్యాన్ని సూచిస్తుంది. పేరయ్య ఒకనిరుపేద చేనేత పారిశ్రామికుఁడు దరిద్రనారాయణుని అపరావతారము అతనిప్రాచీన కళావిభవాన్ని ప్రస్తుతవిపరిణామాన్ని సూచిస్తు తెరలోనుండి ఒకపద్యం వినపడుతూంది.)

నీకెన్నడబ్బురా నిఖిలదేశాలలో
 నిన్నుఁగూరిచి మెచ్చు కొన్నరోజు
నీవెప్డుకనెదురా నీనేర్పుఁజూచిరా
 జేంద్రులు జాగీరు లిడినరోజు
నీకెప్డుడమరురా నీఖజానానుండి
 మునుజమీఁలు బుణాలు గొనినరోజు
నీవెప్డుకాంతురా నీచేతిమీఁదుగా
 స్వర్ణయుగము దిద్దఁ బడినరోజు
నేత! కార్మికుఁడా! మున్ను నీవొకపుడు
వెలిఁగి పోతివి వెన్నెల వెలుఁగులోన
దిక్కు తెలియవురా నేఁటికకటకట!
కటిడుగట్టిన కాలు చీఁకటులలోన.

పేరయ్య:— (ప్రవేశము జిజ్ఞాసగా) ఈ దేశానికి మిల్లులేమని వచ్చాయో! నానాఁటికీ చేనేత పరిస్థితి తీసికట్టయిందీ. మిల్లులు మాపాలిటి నల్లులు. మాజీవరక్తాల్ని పీల్చే

స్తున్నాయి. అడకత్తెరలో పోకచెక్కలాగ నలిగిపోతున్నాం మిల్లుపోటీతో. మిల్లుగుడ్డల పైపై మెఱుంగులనుచూచి మురిసిపోతున్నారు ప్రజలు. నేతబట్టల్ని కొనేదిక్కు లేదు. మగ్గమే మనుగడగానున్న మానోళ్లో మన్నుపడింది. నెలలకు నెలలే పనిలేక మగ్గంబూజు పట్టిపోతూంది. మగ్గానికి పనిచూపించేవాళ్ళు లేరు. ఊరకుండలేక ఆ మధ్య ఏదో రెండు చీరెలునేస్తే అవి అమ్మేసరికి దేవుళ్ళు దిగివచ్చారు. కొనే దిక్కులేక అయినమట్టుకు తెగనమ్ముకోవలసి వచ్చింది. అవి అమ్మితే వచ్చిన ఆ నాల్గురాళ్ళు ఉప్పునా పప్పునా కాకుండ పోయినవి. ఒకనాఁడా? రెన్నాళ్లా? దాదాపు నెలనాళ్లనుండి సాగిపోతూంది నిరుద్యోగం! ఏ నీపాటూ లేకుండ ఎన్నాళ్ళు గడిపేటట్లు ? ఏ పాటు తప్పినా సాపాటు తప్పుతుందా ? ఉన్నవన్నీ కలుక్కొని తినేశాము. వానకురిస్తే వరదలు కట్టే ఉన్న ఈ పూరిల్లు సుబ్బరాజుకు తాకట్టు. ఆ.కునకాస్త పున్నెం కట్టుకొంటే మే మిఁకచెట్టు కుట్టి గట్టుకోవలసిందే. ఒక్కగాని ఒక్క కొడుకైనందుకు వాఁడి చదువుకి సగంజీతం గూడ కట్టుకోలేక పోతున్నాం. నిర్విరామంగా నిరాహార దేవత మా మీఁద దాడి జరుపుతూంది. దీని ప్రళయనాట్యం క్రింద నిస్సహాయమైన యీ నిరుపేద కుటుంబం నిశ్శేషమై పోయేటట్టుంది. కవ్వించి కష్టాలు మీదికి దూకుతున్నాయి. కాఱుచీకట్లు పేరుకొన్న నా జీవితాకాశంలో వెన్నెల వెలుఁగులు సున్నకాఁబోలు !

నా భవిష్యజ్జీవిత విషాద నాటకానికి నాందీ ప్రస్తావన లేనాడో జరిగిపోయాయి. కష్టాల పరమావధితో నా బ్రతుకు మంగళం పాడేటట్టుంది. ఈ సంసారసాగరం లో చెలరేగిన వాయుగుండంతో నా అయోమయ జీవితనౌక బ్రద్దలై పోతుందా? ఆశారేఖలు లేశమైనా కనుపించని యీ సంసారంలో నా జీవితనౌక బ్రద్దలై పోతుంది నిజంగా. విశ్వనాటక రంగంలో నా జీవిత విషాదాంత నాటకం ప్రదర్శిత మౌతుంది. లోకు లశ్రుసిక్త నయనాలతో, ఆర్ద్రహృదయాలతో నా జీవిత నాటకాన్ని దర్శిస్తారు.

(అంతలో పేరమ్మ ప్రవేశించును)

పేరమ్మ:- ఎవరితో మీరు మాట్లాడేది ?

పేరయ్య:- ఎవరితోనూ గాదు. నాతోనే నేను మాట్లాడుకొం టున్నాను.

పేరమ్మ:- ఏమిటి ? యీ మాటలు.

పేరయ్య:- పిచ్చిమాటలు. మన కుటుంబ పరిస్థితికి నాకు పిచ్చెత్తుక పోతూంది. ఒకప్రక్క నిరుద్యోగం- మరొక ప్రక్క నిరాహారం- ఇంకొకప్రక్క ఒక్కగాని ఒక్క కొడుకైనందుకు వాడి చదువుకోసం సగంజీతానిగ్గూడ గతిలేని దుర్గతి- హృదయంలో ఏదో ఆవేదన తలతిరిగి పోతూంది. (కాసేపాగి) పిల్లవాడెక్కడికి పోయాడు?

పేరమ్మ:- బడికి పోయాడిప్పుడే.

పేరయ్య:- బడికి పోయాడా ? నిన్న యెప్పుడు తిన్నన్నమో పాపం. బడికెట్లా పోయాడు ? పోనీ - ఇవ్వేళటికి పోవద్దనక పోయావా ?

పేరమ్మ:- అన్నాను. అన్నం లేకపోయినాసరేకానీ, వాఁడు బడి మానుకొంటాఁడా ?

పేరయ్య:- (జాలితో) నిజమేపాపం ! పెద్దగా చదువు కోవాలని వాఁడు పెద్దంతాశతో నున్నాఁడు. ఎండమావుల్లో మంచినీళ్ళు తాగ్రిగుదా మనుకొంటున్నాఁడు. ఏం ప్రయోజనం ? వాఁడు కనే తీయతీయటి కలలన్నీ పగటి కలలు. పాపం ! ఈ పూట చద్దన్నంకూడ లేదుగదా! బడి కెందుకు పోనిచ్చావు ?

పేరమ్మ:- నిన్న సాయంత్రం బడినుంచి వస్తుంటే దోవలో అణా దొరికిందట. ఆ యణాతో ప్రొద్దున గుగ్గిళ్లు తెచ్చుకొని అవి తిని యిన్ని నీళ్ళు త్రాగి పోయాఁడు.

పేరయ్య:- (పెకలించుకొని వచ్చే దుఃఖాన్ని మ్రింగుకొంటూ) వాఁడికి చదువు మీఁ దెంత ఉబలాటం ? అన్నం లేక పోయినా గుగ్గిళ్ళుతిని నీళ్ళతో పొట్టనింపుకొని బడికి పోయాఁడు. ఒక్కగాని ఒక్క కొడుకు. వాఁడికి చదువు మీా దింత మోజుంటే వేళకింతన్నం పెట్టి చదివించుకోలేని గర్భదరిద్రులమైపోయాం.

పేరమ్మ:- గొడ్డురాలి గర్భవాంఛలు ! ఏ మారాజుల కడుపునన్నో పుట్టక దరిద్రుల కడుపున బుట్టి కొడుకెంత దురదృష్టవంతుఁడయ్యాఁడు ? గాలి మేడల్లో నివసిద్దామనుకొంటూన్న వాఁడి ఆశలు చూస్తుంటే గుండెల్లో సముద్రాలు పొర్లిపోతున్నాయి. (ఏడ్చును)

పేరయ్య:- ఇద్దఱమూ ఏడుస్తున్నాము. మన మేడిస్తే ఎవరికి జాలి ?

పేరమ్మ:- ఎవరికీ లేదు జాలి. లేనివాళ్ళం లేక యేడుస్తుంటే ఉన్నవాళ్ళు, వాళ్ళు తినటమే కాక వాళ్ళింటి కుక్కలు గూడ తింటున్నయి.

పేరయ్య:- నిజమే. వాళ్ళింటి కుక్కలతోఁబాటు కూడ చేయడము లేదు మన బ్రతుకు. (ఏడ్చును)

పేరమ్మ:- ఊరుకోండి! నేనేడుస్తున్నాను. మీరూ ఏడుస్తున్నారు. ఓదార్చేవాళ్లెవరు మధ్య?

పేరయ్య:- ఎవరూ లేరు. మనకు మనమే. మన గోడడవి గోడు. ఇంకెవరమూ ఏడవవద్దు. ఏడుస్తూకూర్చుంటే యీ వేళ గడుస్తుందా? ఇవ్వేళ పొయ్యిలోనిపిల్లి లేచే దెలాగు? గింజలు లేవుకామాలి?

పేరమ్మ:- లేవు. చిట్టెడు గింజలు కూడ లేవు. ఇరుగునా పొరుగునా నోటి మంచితనంచేత బియ్యం తెచ్చుకొని తిన్నాము. వెనుకటివి యీయకుండే మళ్ళీ వాళ్ళింటి కేమని పోయేది?

పేరయ్య:- వద్దు. పోవద్దు.

పేరమ్మ:- మఱి, యీ వేళ యేంచేసేటట్టు?

పేరయ్య:- ఏం దరిదోవ తోఁచటంలేదు.

పేరమ్మ:- తోఁచకపోతే ఈ రోజు పస్తే. పోనీ - ఎవరినైనా పోయి అప్పడగండి!

పేరయ్య:- ఒకర్ని అప్పడగటమంటే ప్రాణంమీదికి వస్తూంది. అభిమానాన్ని యెలా చంపుకోనేటట్టు?

పేరమ్మ:- అభిమానమున్నా అధ్వానమున్నా, వీటితో పెట్టుకొంటే ఏమయ్యేటట్టు? పిల్లవాఁడు బడినుండి వస్తాఁడే వాణ్ణలాగే పస్తుపెడతామా?

పేరయ్య:- (దుఃఖం) వద్దు. వాణ్ణి వస్తుపెట్టవద్దు. పాడు అభిమానం! బిడ్డకంటె ఎక్కువా? పోతాను. ఏదో రెండు రోజుల్లో ఇస్తానని అంగడివాని కాళ్లమీంద పడతాను.

పేరమ్మ:- పోండి! తొందరగా పోండి! ఇప్పటికే చాల వేళయింది. అబ్బాయి బడినుండి వస్తాఁడు.

పేరయ్య:- (నిష్క్రమించును)

పేరమ్మ:- (ఆవేదనతో) అబ్బా! సముద్రాన్నైనా యీదవచ్చే మోగాని సంసారాన్నీదలేము. అందులో నిరుద్యోగంతో, నిరాహారంతో నిప్పచ్చరంతో నడచు మా పేద సంసారం, సాగరాన్ని మించింది. ఏం చేస్తాము? మగ్గం బూజుపట్టిపోతూంది. మగ్గమే మా మనుగడ. మగ్గం తప్ప మళ్ళా మాన్యాలు మా కేమీలేవు. ఈ పరిస్థితిలో ఈ కుటుంబమేం కావాలో? నిండు వస్తులింకెన్నాళ్ళు గడపాలో? మంచి రోజుల్లో సంపాదించుకొన్న చిన్నారి పొన్నారి వస్తువులన్నీ కరిగిపోయాయి. చేతిలో ఎఱ్ఱని ఏగానిలేదు. ఎవరి సంసారాలు వారికే బరువుగా ఉన్న యీ కరువు రోజుల్లో ఏదో మంచితనాన బియ్యం అప్పులు తెచ్చుకొని ఒకపూట తిని, రెండోపూట తినకుండా ఇంతదాక గడుపుకొనివచ్చాను. ఈ రోజు ఎట్లా గడుస్తుందో? ఏమో? అంగట్లో అప్పు తెస్తానని ఆయన వెళ్లాఁడు. అంగడివాని మనసు కరిగి ఏదో అప్పిస్తేసరి. లేకపోతే ఏం చేయాలో?

ప్రసాద్:- (బడినుండి వస్తాఁడు)

పేరమ్మ:- అబ్బాయి! అప్పుడే వచ్చావేం? బడి వదిలారా?

ప్రసాద్:- లేదమ్మా! నాన్న యేడీ?
పేరమ్మ:- వెళ్లాఁ డిప్పుడే.
ప్రసాద్:- ఆయన తిప్పలాయనవి ......... నే నీక బడికి పోనమ్మా!
పేరమ్మ:- (గాబరాగా) ఏం నాయనా! ఎప్పుడూ అనని మాట అంటున్నావు?
ప్రసాద్:- పేదవాళ్లకు చదువు లెందుకు లేమ్మా!
పేరమ్మ:- బడిలో నిన్నెవరైనా ఏమైనా అన్నారా? నాయనా!
ప్రసాద్:- ఎవరూ-ఏమీ అనలేదు. నాకు నేనే అంటు న్నాను. క్లాసులో పిల్లలందఱు మంచిమంచి గుడ్డలతో ముచ్చటగా కూర్చుంటే వాళ్లల్లో నే నీ చిఱుగు బొంత లతో కూర్చోవటానికి సిగ్గుపడుతున్నానమ్మా!
పేరమ్మ:- వాళ్ళంతా ఉన్న మారాజులు. మనం లేని దరి ద్రులం. వాళ్లవలె మనం ఉండాలంటే ఎలాగు నాయనా!
ప్రసాద్:- అయినా వద్దమ్మా! మనకు చదువులు. రెండు నెలలుగా జీతం గూడ కట్టలేదు. మన పరిస్థితిచూస్తూ నేనుగూడ నాన్నని జీతం అడగలేదు. నా పేరు రిజిస్ట రులో తీసివేశారు. ఇన్నాళ్లు అందఱితోఁబాటు క్లాసు లో కూర్చొని పాఠాలు వినివస్తున్నా. అంతేగాని నాకు హాజరు వేయటం లేదు. నాకు చదువు వద్దమ్మా! నేను బడికి కొట్టినా పోనమ్మా!
పేరమ్మ:- పోనీలే నాయనా! బడిమాను. ఇంటిదగ్గర నే ఉండి పని నేర్చుకో. ఏం చేస్తాము. వెనుకబడ్డ జాతుల వారికి సగం జీతం ప్రభుత్వ మిస్తున్నా మిగతా జీతం

గూడ కట్టుకోలేని పరిస్థితిలో నున్న మనకు చదువు లూరకనే ఎవరు చెప్పుతారు ?

ప్రసాద్:- (బాధతో) అమ్మా! తల బద్దలు కొట్టినట్లుగా ఉన్నది. ఒళ్లు తిరిగిపోతూంది. పడుకొంటానమ్మా!

పేరమ్మ:- అన్నం లేనిమీదట ఒళ్లు కైత్యగించిం దేమోరా ! కాసేపు పడుకో. ఈ కాపరానికింత మంచానిక్కూడ గతిలేదాయె. (ఏడ్చును)

ప్రసాద్:- ...నీ-ఆ చినిగిన చాప అక్కడ వేయమ్మా.

పేరమ్మ:- (చిరిగినచాప తెచ్చి నేలమీఁద పఱచి కొడుకును పరుండఁజేయును. పరిస్థితికి క్రుక్కిళ్లు మ్రింగుతూఏడ్చును)

ప్రసాద్:- ఎందుకమ్మా! ఏడుస్తున్నావు ? నేను చచ్చిపోతా ననా ?

పేరమ్మ:- ఏం మాటలు నాయనా! అట్లనగూడదు. ఊరుకో నాయనా !

ప్రసాద్:- ఆఁకలవుతూందమ్మా ! అన్నంపెట్టమ్మా!

పేరమ్మ:- (ఒక్కపెట్టున యేడుస్తు) అన్నం—ఆకలి—ఈ రెండే ఈ కాపరాన్ని పీడించుకొని తింటున్నాయి. కూడులేక యీ కుటుంబమీనాఁడు మాడిచావాల్సిందేనా? కన్న బిడ్డల్ని అన్నంపెట్టలేక చేఁజేతుల చంపుకోవాల్సిందేనా?

ప్రసాద్:- (ఆకటిబాధతో) కడుపులో ఆకలిసొద నిప్పుపెట్టి కాల్చినట్టున్నది. ఇంతకూ నీవు అన్నం వండలేదా ? యేమ్మా !

పేరమ్మ:- (దుఃఖముతో) వండలేదు నాయనా! మీ నాన్న

బజారుకు పోయాఁడుబియ్యానికి. రానియ్యి. కాసేపట్లో వండి ముందు నీకు పెడతాను.

ప్రసాద్:- ఇంకా నాన్న రాలేదా? అమ్మా !

పేరమ్మ:- అడుగో! వస్తున్నాఁడు. నీవు పడుకో.

(పేరయ్య ప్రవేశము దిక్కు మొగముతో)

పేరమ్మ:- (భర్తనైఖరిఁ జూచి హీనస్వరముతో) ఊరకేవచ్చా శేం ? అంగట్లో అప్పీయలా ?

పేరయ్య:- లేదు. బిడియాన్ని బిగబట్టి కాళ్లూ గడ్డం పట్టుకొని బ్రతిమాలాను. అంగడివాఁడు గిద్దెడు గింజలైనా అప్పీయలా. సిగ్గుమాలి స్నేహితుణ్ణొకణ్ణి చేయిచాచి ఒక్కరూపాయి బదులిమ్మన్నాను. చిల్లిగవ్వ గూడ లేదన్నాఁడు. ఊరకేరాక ఏం చేయమంటావు? (చాలవిరక్తిగా) ఈ సంసారసముద్రాన్ని యీదలేకనా తలప్రాణం తోకకు వస్తూంది. ఎక్కడలేని విసుగు విరక్తి పుట్టేసి సన్న్యాసం పుచ్చుకొని ఏ అడవులకైనా పరుగెత్తుదామా అనిపిస్తుంది. అదీ యిదీ కాకపోతే ఏ నుయ్యో ? గొయ్యో ? చూచుకొందామా అనిపిస్తుంది. ఆబుబిడ్డల్ని బ్రతికించుకోలేని చవట బ్రతుకేం బ్రతుకు?

పేరమ్మ:- ఈ పురాణ వైరాగ్యాలతో, శ్మశాన వైరాగ్యాలతో ఇప్పుడేం ప్రయోజనం ? మనవంతు కష్టాలెవర నుభవిస్తారు ? దీనికే సన్న్యాసమా? ఆపదల్లో ధైర్య మవలంబించాలి. నిరుపేద ప్రజానీకానికదే వజ్రకవచం.

పేరయ్య:- నిజమే. ఎందాకని ధైర్యం బిగబట్టేది? ఆశావ

కాశాలు లేశమైనా కనుపించనప్పుడు ధైర్యం నిలుస్తుందా? నిల్పుకొందామన్నా. కష్టాల్లో ధైర్యమవసరమే నీవన్నట్లు. ఒక కష్టమా? ఒకప్రక్క డొక్క ఎండుకొనిపోతూ వస్తులు మాడుతున్నాం. ఇంకోప్రక్క కట్టుకోవటానికి గుడ్డలులేక చిరిగినబొంతలతో కాలం వెళ్ళబుచ్చుకొంటూన్నాం. మఱొకప్రక్క వానకురిస్తే వరదలుగట్టుతూ-ఉండటానికీ పండటానికీవీల్లేని యీ పూరికొంపలో పొర్లాడుతున్నాం. ఇదిగూడ దక్కక చెట్టు కుట్టి గట్టుకో పోతున్నాం. ఇంకొకప్రక్క గుండెలుపీకే అప్పులబాధ. నానాబాధలు నాకు పిచ్చెపుట్టించి బైరాగిని చేసేటట్లున్నాయి.

పేరమ్మ:- ఏ బాధలెట్లుండినా పిల్లవాఁ డాఁకలి బాధతో నకనకలాడుతున్నాఁడు. చూడు. అడుగో ఆ చాపమీఁద.

పేరయ్య:- అబ్బాయి బడినుండి అప్పుడే వచ్చాఁడా?

పేరమ్మ:- వచ్చి కాసేపయింది.

పేరయ్య:- (కొడుకు దగ్గరకుఁ బోయి ఒళ్ళుపట్టి చూస్తాఁడు ఒళ్ళిట్లా మాడిపోతుందేం?

పేరమ్మ:- (గాబరాగా) ఆఁ, ఒళ్ళుమాడిపోతుందా? ఇందాక చల్లఁగానే ఉన్నదే(కొడుకునుపట్టిచూస్తుంది)అమ్మయ్యో? జ్వరం! పోయి వైద్యుణ్ణి పిలుచుకొనిరాండి! తొందరగా-

పేరయ్య:- వైద్యుఁడు- ఏవైద్యుఁడు వస్తాఁడు డబ్బియందే-

పేరమ్మ:- మఱి కొట్టుదినుసులైన......

పేరయ్య:- అవిమాత్రం ఊరకనేవస్తాయా?

పేరమ్మ:- ఇంకేదైనా దారిచూడండి!

పేరయ్య:- ఏందారి చూచేది? గోదారి.

ప్రసాద్:- (జ్వరంలోనే) అమ్మా! నాన్న వస్తున్నాడంటివే! వచ్చాడా?

పేరయ్య:- వచ్చారా నాయనా! (దుఃఖం)

ప్రసాద్:- బియ్యం తెచ్చావా?

పేరయ్య:- బియ్యం- తేలేదు__

ప్రసాద్:- ఇంకా తేలేదా? అమ్మా? చద్దన్నంగూడా లేదామ్మా? పోనీ, అంత గంజైనా పోయవే? అదీ లేకపోతే - మంచి నీళ్ళన్నా తేమ్మా!

పేరమ్మ:- (మంచినీళ్ళు తేవటానికి ఇంట్లోకిపోతుంది)

పేరయ్య:- (ఏమీతోచక పిచ్చివానివలె ఇటూ అటూ తిరుగుతుంటాఁడు)

[సుబ్బరాజు ప్రవేశము]

పేరయ్య:- (చకితుఁడై చూస్తాఁడు సుబ్బరాజువంక)

పేరమ్మ:- (మంచినీళ్ళ గ్లాసుతో వచ్చి సుబ్బరాజువంక నిర్విణ్ణయై చూస్తూ నిలఁబడిపోతుంది)

పేరయ్య:- (తేరుకొని గద్గదిక స్వరంతో) మీరా? ఇప్పుడెందుకు వచ్చారు?

సుబ్బ:- ఎందుకేమిటి- ఇల్లు__

పేరయ్య:- ఖాళీచేయాలనా? గోరుచుట్టుపై రోఁకటి పోటన్నట్లు అదీ ఇప్పుడేనా?

పేరమ్మ:- (దుఃఖాన్ని మ్రింగుకొంటూ కొడుక్కి- మంచినీళ్ళు త్రాగిస్తుంది)

సుబ్బ:- ఇప్పుడే యిల్లు ఖాళీచేయాలి. మూఁడేళ్ళలో బాకీ తీరుస్తానని నీయిల్లు తాకట్టు వ్రాసియిచ్చావు. ఆగడువు మొన్నటితో తీరిపోయింది. ఇల్లుతక్షణం ఖాళీచేయాలి?

పేరయ్య:- ఈ రోజంతా మా కు నిట్టుపాసం. కుఱ్ఱవాఁడు జ్వరం తో బాధపడుతున్నాఁడు. ఈ అవస్థలో మమ్మెక్కడికి పొమ్మంటారు?

సుబ్బ:- అది నన్నడుగుతావా? ఎక్కడికీ కాకపోతే ఊరి వెలుపల చెట్టుకుట్టి కట్టుకో పో-

పేరయ్య:- (బ్రతిమాలుతూ దుఃఖంగా) అయ్యా! మీ కడుపున బుట్టి, లేదా? మీ యింట కుక్కనై మీ బాకీ తీరుస్తాను. మమ్మీ శిథిలగృహంలో ఏదో యింత దీపారాధన చేసికో నీయండి! దయతలఁచండి?

సుబ్బ:- వీల్లేదు. నాకూ-దయకూ చాలాదూరం. ఇంట్లోనుంచి ఇప్పుడే లేచిపో—

పేరమ్మ:-(ఇంట్లోకిపోయి వంటపాత్ర లవి సర్ది మూటకట్టుతుంది దుఃఖంతో)

సుబ్బ:- ఊఁ పేరయ్యా! మర్యాదగా కదులు.

పేరయ్య:- (కాళ్ళుపట్టుకొని) మీ కాళ్ళు పట్టుకుంటాను మమ్మీ యింట్లో-

సుబ్బ:- (విదిలించుకొని నెట్టివేస్తాఁడు)

పేరయ్య:-(నేలమీఁద వెల్లికల పడిపోతాఁడు)

ప్రసాద్:-(కెవ్వున ఏడుస్తాఁడు చూస్తూ)

పేరమ్మ:- (ఇంట్లోనుంచి మూటతో వచ్చి బావురుమంటుంది)

సుబ్బ:- (ఇంటితలుపు వేస్తాఁడు)

(పేరయ్య కుటుంబం గొల్లుమంటుంది)

సుబ్బ:- (ఇంటికి తాళం వేసుకొని) ఈ పంచలోగూడ ఉండ వద్దు. వెళ్ళిపో—

పేరమ్మ:- లెండిపోదాము! నెమలి కంటనీరుగారిస్తే వేటగానికి ముద్దా? (కొడుకును లేపుతూ) లే నాయనా!

ప్రసాద్:- ఇప్పుడెక్కడికి పోదామమ్మా! ఆఁకలమ్మా! నడవ లేనమ్మా!

పేరయ్య:- (దుఃఖముతో నోట మాటరాదు కొడుకు నెత్తు కొంటాఁడు)

పేరమ్మ:- (మాటదీసుకొని చిరిగిన చాపచుట్టి చంకఁ బెట్టు కొంటుంది. నడుస్తారు అర్థంగాని అయోమయావస్థతో ఎక్కడికో - వారి దుర్గతిని సూచిస్తూ తెరలోనుండి విషాద వీణాతంత్రుల్లో మేళనమై పాట వినపడుతుంది)

గే య ము

పదపదా నిర్భాగ్య వస్త్రకారకుఁడా!
పదనోయి! పదపదా వస్త్రకారకుఁడా!!
చెదరిన హృదయాన - ప్రిదిలిన ధైర్యాన
పదములు గుదివడ కదలలేకున్నావ? ॥పద॥
పేరినకష్టాలు- ఆరని ఆఁకలి-
తీరని దారిద్ర్య తీవ్రయాతనలో
మారని జీవిత మారణాధ్వరములో
మారణమే అనివారణ మేమో? ॥పద॥



# ఐదవ రంగము

సుబ్బరాజు మేడ

(సుబ్బరాజు వరండాలో ఒక్కడే యేదో చీకాకుగా పచా
రులు చేస్తుంటాడు.)

సత్యా:- (ప్రవేశించి) నాన్నా ! నాన్నా !

సుబ్బ:- ఆఁ, ఏ మమ్మాయి !

సత్యా:- ఏమిలేదు నాన్నా ! నీతో చెప్పాలనుకొంటున్నా

సుబ్బ:- ఏమని ?

సత్యా:- నీ విధానం బాగుండలేదని——

సుబ్బ:- ఆఁ, నా విధానము బాగుండలేదనా - ఏమిటి నా విధానం?

సత్యా:- కలిమిబలిమితో కటికిపేదల్ని కష్టపెట్టు కఠినవిధానం.

సుబ్బ:- (కోపంగా) ఇదా నీవు చెప్పవచ్చింది.

సత్యా:- కడుపులో ఏదో అక్కసు పెట్టుకొని ఆ సుధాకరరావు నా విధంగా పాతబాకీ బయటికి తీసి ఆస్తి జప్తు చేయించావు. అంతటితో ఊరుకోక అరెస్టు సైతం జరిపించావు. అదటుపోనీ, పాపం! కటికి పేదవాఁడే, ఆలుబిడ్డలతో కూడు లేకల్లాడు తున్నాఁడే, ఆ పేరయ్యాను కొంపలోనుంచి లేవదీయించావా ? ఇంత కసాయి తనమా ? నాన్నా !

సుబ్బ:- అయితే పేదవాళ్లని ఊరుకొంటే సొమ్మెం కావాలను కొన్నావు?

సత్య:- సొమ్ముమీంద నీకెందుకు నాన్నా! ఇంత మమకారం?

సుబ్బ:- సొమ్ముమీంద నాకు మమకారమైతే, సొమ్ముమీంద నీ కెందుకింత తృణీకారం?

సత్య:- సొమ్ముమీంద నాకేం తృణీకారం లేదు. ఎంతసొమ్ము సొమ్మనుకొన్నా కొంత కుడీ-యెడమ లుండాలి. సొమ్ము కోసమని పేదల్ని పీడిస్తే యింక పారమార్థికమేమిటి?

సుబ్బ:- పిచ్చిదానా! ఈ పారమార్థికాలతో పెట్టుకొంటే డబ్బు నిలుస్తుందా? నీవు డబ్బు మహిమ తెలియక మాట్లాడుతున్నావు. డబ్బున్నవాండే చెలామణి యీ రోజుల్లో. డబ్బు లేనివాం డొక జీవచ్ఛవం.

సత్య:- పొరపడుతున్నావు నాన్నా! జీవచ్ఛవం డబ్బు లేని వాండేకాదు. డబ్బుండియు దాన్ని సార్థకపరచుకోలేని వాండును జీవచ్ఛవమే. డబ్బు డబ్బంటావు. నీవుపా సించే యీ డబ్బు శాశ్వతంగాదు నాన్నా! మాట శాశ్వతం. మాటపోతే మానవుండికి మానం-మర్యాద ఉండదు.

సుబ్బ:- అయితే నీ ఉద్దేశం నాకు మాట పోయిందనేనా?

సత్య:- పోయింది నాన్నా! నీ మాట యెప్పుడో పోయింది. ఏనాడో నిన్ను స్వార్థపరుల జాబితాలో జమ కట్టింది లోకం. నీవు మాట నిలబెట్టుకోవాలంటే నీలో మార్పు రావాలి.

సుబ్బ:- ఏం మార్పు రావాలో చెప్పు? అదిగూడ.

సత్య:- నీ స్వార్థాన్ని చంపుకొని, నిస్వార్థమయ జీవితాన్ని సాగించు. పేదల్ని పీడించటం మాని లాలించట మల వాటుపడు. ధనాన్ని దాచిపెట్టుకోవటమే ముఖ్యమను కోక దేశం కొఱకు, సంఘం కొఱకు కొంత దానం చేయి. లోకమప్పుడు నీకు జోహారు లర్పిస్తుంది.

సుబ్బ:- జోహారులు! నా కెందుకీలోకమిచ్చే జోహారులు. లోకం జోహారులిస్తుందని కష్టపడి కూడఁబెట్టిన డబ్బును పాడుచేసుకోమంటావా ?

సత్య:- అది-పాడుచేసుకోవటమూ నాన్నా! లోకంలో ధనం శాశ్వతంగాదు. కీర్తి శాశ్వతం. కీర్తి కావాలంటే కొంత త్యాగం చేయాలి. త్యాగమయ జీవులే నిజంగా ధన్యులు, లోకంలో వారిపేరు శాశ్వతో స్మరణీయం.

సుబ్బ:- అమ్మాయి! నీవు నూరుచెప్పు. నీవు చెప్పేది నా తలకెక్కదు.

సత్య:- ఎక్కదు నిజంగా. అది చెప్పితే వచ్చేదికాదు. సహజంగా రావాలి. త్యాగగుణం అనేక జన్మల సంస్కార ఫలం. ఆ త్యాగజీవులు నిజంగా అదృష్టవంతులు.

సుబ్బ:- అయితే, నేను దురదృష్టవంతుణ్ణనేనా నీ భావం.

సత్య- ముమ్మాటికి నీవు దురదృష్టవంతుఁడవే. నీకు దేవుఁడు సంపాదించే బుద్ధి నిచ్చాఁడేగాని, త్యాగబుద్ధి నీయ లేదు. త్యాగంలేని నీ డబ్బెందుకు నాన్నా! నీ డబ్బుకు వెలుఁగు లేదు. వెన్నెలలేని రాత్రివలె, త్యాగంలేని డబ్బు నిరుపయోగం.

సుబ్బ:- నిరుపయోగమో, సదుపయోగమో నీవు నాకేమీ చెప్పనక్కర లేదు.

సత్య:- పోనీ, నాన్నా! పుణ్యముంటుంది. ఉసూరుమంటాఁడు పాపం! ఆ పేరయ్య యిల్లు పేరయ్య కిచ్చివేయి. పేద వాఁడు ఏదో దీపారాధన చేసుకొంటాఁడు.

సుబ్బ:- ఆఁ, ఆ యిల్లు పేరయ్యదా? ఆ యింటిమీఁద నేను డబ్బియలేదను కొన్నావా ?

సత్య:- ఇచ్చావు.

సుబ్బ:- మఱి అదేం కావాలి.

సత్య:- ఏమీకాదు. ఇస్తేఁడు, పేరయ్య బ్రతికుంటే యేనాఁటి కైనా—

సుబ్బ:- ఆ పేరయ్యమీఁద నీ కెందుకింత సానుభూతి ? పేదల కష్టం నీ కష్టంగా ఉన్నట్లున్నదే ?

సత్య:- అది నా స్వాభావికం నాన్నా ! ఇతరులు కష్టాలు పడుచుంటే నేను చూడలేను. నీ హృదయం మాదిరిగా నా హృదయం కర్కశం చేయలేకపోయాఁడు భగవంతుఁడు.

సుబ్బ:- అలా ఉండటం మంచిదికాదు. జన్మతో లేకపోయినా కర్కశాన్ని, కాఠిన్యాన్ని తెచ్చిపెట్టుకోవాలి. అవే కలిమి కొమ్మ స్వాధీనం కావటానికి మంత్రాలు తంత్రాలు. త్యాగభోగాలూ మెతు సరిపడవు. నేను కాదంటే నీవు అప్పుసంటున్నావు. ఇంతకు నీకు చదువు చెప్పించటం నాదే పొరపాటు. ఆడవాళ్ళ కిందుకనే చదువులుపనికి రావన్నాను.

సత్య:- (కష్టంగా) ఆ మాట అనకు నాన్నా ! నాకు చదువు చెప్పించటం చేతనే నేను లోకంలోని మంచి చెడ్డలు, యుక్తాయుక్తాలు తెలిసికోఁగలిగాను. లేకపోతే యీ

దుర్భర వితంతు జీవితం దోషదూషిత మయ్యేది. స్త్రీ విద్య నాశనంతోనే దేశం శతాబ్దాలుగా పరాయివాళ్ళ కింద బానిసత్వ మనుభవించింది. ఏనాటికైనా భారత సంస్కృతిపునస్థాపితం కావాలంటే అది స్త్రీ విద్యతోనే కావాలి. ఈ సూత్రాన్ని అర్థం చేసుకోలేక నీ వంటి వాళ్ళు ఆడవాళ్ళకు చదువులు పనికిరావంటే అమాయిక ప్రజలు నిజమే ననుకొంటారు. అధోగతి పాలౌ తుంది దేశం. ఈ మాట మళ్ళీ అనకు నాన్నా ? కలలోగూడ నేనిది సహించలేను. నాపై కన్న ప్రేమ నీకుంటే ఇంకొకమారు ఈ మాట యెక్కడైనా అన వద్దు. ఇది చాలా తప్పు. సంఘానికీ, సంసారానికి ముప్పు.

సుబ్బ:- ఈ వ్యతిరేక భావాలతో ఈ యింట్లో ఇద్దరమూ ఉండటమనేది పడదనుకొంటాను.

సత్య:- అది నిజమే నాన్నా ! స్వాతంత్ర్యానికీ, పారతంత్ర్యానికీ పడదు. ద్వంద్వం ద్వంద్వమే

సుబ్బ:- అలాగైతే యీ కొంపలోనుంచి యెవరో ఒకరు లేచి పోవాలి.

సత్య:- లేచిపోవాలి నిజంగా—నేనే పోతాను. పేద ప్రజల జీవరక్తాల్ని పిండి వారి ఉసురులనే పునాదులమీద కట్టిన యీ యింట్లో ఉండటానికి నాకు హక్కు లేదు. పిసినిగొట్టు పీనుగులో ? పీడించుకొని తినే పిశాచాలో ? ఉండగలుగుతాయి. నేనే పోతాను_

సుబ్బ:- (కోపంగా) సరేపో — తక్షణం పో యింట్లోనుంచి.

ఒక్క నిముసమైనా ఉండనక్కరలే దీ కొంపలో ఇప్పుడే పో—

సత్యా:- పోతాను — ఇప్పుడు పోయేదేమిటి? నవమాసాలు మోసి, నన్నుఁగని, ఎంతో ప్రేమతో కడుపులోబెట్టుకొని పెంచిన నా తల్లి లోకాన్ని వదలిపెట్టి పోయిన నాఁడే పోయాను. డబ్బు పేరాసతో నీవు నన్నొక ముసలాఁడివాత పడవేసిన నాఁడే పోయాను. ఆ వృద్ధ పతి మరణంతో ఏ నాడు నా నల్లపూసల సౌరు, పసుపు కుంకంతో సహా పాడయిపోయిందో ఆనాఁడే పోయాను. ఇప్పు డిదొక జీవచ్ఛవం. ఇదైనా నీ ఇంట్లో ఉండదగదు. పోతున్నా— (పోవును)

సుబ్బ:- (చీకాకుగా అటూ యిటూ తిరుగుతుంటాడు. కొంత సేపటికి నిబ్బరపడి) ఏదో ఆవేశంలో అనేశాను. కొండ నాలుక్కి మందువేస్తే ఉండనాలుక ఊడినట్లయింది. కన్నకూఁతురు ఇలా యెదురు తిరుగుతుందని కలలోఁ గూడ అనుకోలేదు. గుర్తువచ్చి పిల్లను వెక్కిరించిందన్నట్లు నాకూఁతురే నన్ను వ్యాఖ్యానిస్తూంటే యిఁక లోకులూరుకోమంటే ఏం ఊరుకొంటారు. నా యింట్లో నా కూఁతురే నాకు వ్యతిరేకంగా తయారయితే లోకుల్ననే పనేముంది? అసలు ఆడపిల్లకు చదువెందుకని యెంతగనో మొత్తుకొన్నా — వాళ్ళమ్మ పడనిచ్చిందా? దానికేం అది స్వర్గంలో కులాసాగా ఉన్నది. అనుభవిస్తుందంతా నేను. (ఏడుస్తాఁడు)

పనివాఁడు:- (అప్పుడే ప్రవేశించి సుబ్బరాజు మొగంవంకచూచి)

ఎందుకు బాబూ! ఏడుస్తున్నావు?—ఆ సంగతి నాకంటె ముందేవచ్చి నీ చెవుల్లో పడ్డదా యేం?

సుబ్బ:- ఏ సంగతిరా?

పనివాడు:- ఆ సంగతే బాబయ్యా! గుమాస్తా సంగతి.

సుబ్బ:- (ఆతృంగా) గుమాస్తా సంగతేమిటిరా? చావు కబురు చల్లగా చెప్పినట్లు చెప్తూతావేం? తొందరగా చెప్పు?

పనివాడు:- గోవిందు యిల్లు వేసినతాళం వేసినట్టే ఉంది.

సుబ్బ:- ఇల్లు తాళంవేసి పలాయనం చిత్తగించాడా యేం? కొంపముంచి బాకీలు వసూలు చేసుకొని పోలేదుగా?

పనివాడు:- అదే పుకారుగా ఉంది. ఊళ్ళో.

సుబ్బ:- ఏం పుకారురా—చెప్పు చంపక తొందరగా.

పనివాడు:- అదేనండి బాబయ్యా! మీ రన్నదే. ఆసాముల దగ్గఱ రావలసిన అయిదువేల రూపాయలు వసూలు చేసుకొని——

సుబ్బ:- (కొంపమునిగినట్లు) ఆఁ, ఆఁ, రూపాయలు వసూలు చేసుకొని—పోయాడా యేమిటిరా?

పనివాడు:- పోయాడనే అనుకొంటున్నారు.

సుబ్బ:- ఆఁ, నిజంగానే? తొత్తుకొడుకెంతపని చేశాడు. నమ్మించి తడిగుడ్డలతో గొంతు కోశాడు. అమ్మో! అయిదువేల రూపాయలే! కూఁటికు పోయిందానికి తోడిదొకటా!

పని:- అయ్యో! సత్యంతమ్మ పోయిందా! ఆలనా పాలనా అతీగతీ విచారించి పనోళ్ళని ఆదుకొనేదే మా తల్లి పోయిందా? (ఏడ్చును)

సుబ్బ:- నీ యేడుపు కట్టిపెట్టి పోయి వెదుకు ముందు.

పని:— ఆఁ వెదకమంటున్నారా ! పోయిందంటె సరే !

సుబ్బ:— పోయిందంటే నీ వేమనుకొన్నావు ! నాతో పోట్లాడి పోయింది యిప్పుడే. ఊరు నాలుగుమూలలా గాలించు పో.

పని:— (ధైర్యంవచ్చి) చంపేసుగదండి ! బాబయ్యగారు ! అమ్మాయిగారు పోయారంటే నే నపార్థం చేసుకొన్నానుగదండి ! మా తల్లిని పోనిత్తానా ! గాలించుక తీసుక వత్తా ఎక్కడున్నా. (నిష్క్రమణ)

సుబ్బ:— (దిగులుగా) నమ్మినందుకు నాకు నామాలు బాగా పెట్టాఁడు సుమా ! "అతివినయం ధూర్తలక్షణం" అన్నట్లు ఇందుకే కామాలి ! అంత వినయాన్ని అభినయించాఁడు ? వీఁడి దుంపతెంచ! అడుగులకు మడుగులొత్తినట్లు నటించాఁడే ! నా దగ్గర సేవకుఁడుగా గాదు. సేవక శిరోరత్నంగా మెలిఁగాఁడే ! నన్నిలా బుట్టలో వేసుకోవటానికేనా ? తస్సదియ్యా ! సుబ్బరాజుకే టోపీ పెట్టాఁడే ! అయిదువేల రూపాయలు ! దమ్మిడీకి దమ్మిడీగా పిల్లలు పెట్టించి లక్షాధికారి నవుదామన్నాను. అయిదువేలు తెసుగు, నా లక్షకు. (దరిదాపుల తిరుగులాడుచుండఁగా కాలికి తాళాలు తగులుతవి తీసి చూస్తాఁడు అవి ఇనప్పెట్టెవి. గుండె గుభేలుమంటుంది) ఇనప్పెట్టె తాళాలిక్కడికెందుకు వచ్చాయి ? కొంప ముంచి పట్టుకెళ్లే దొంగలు పడలేదుగా కొంపలో? (అనుమానంగా యినప్పెట్టె దగ్గరికి వెళ్లుతాఁడు గుండెలు బాదుకొంటూ) ఇంకే మున్నది. నా యినప్పెట్టె

దోచేశారు దొంగలు, ఇనప్పెట్టె తలుపులు తీసిఉన్నయ్. ఇక్కడి నోట్ల కట్టలేవి! మునిఁగిందిరా దేవుఁడా! కొంప. (ఏడుస్తాఁడు అక్కడొక కాగితం ముక్క కనుపడుతుంది దాన్ని చదువుతాఁడు.)

నా విధవ గ్రాసానికి నా అత్తవారిచ్చిన నగల తాలూకు అయిదువేల రూపాయలూ—నగదు తాలూకు పదివేల రూపాయలూ మొత్తం పదునైదువేల రూపాయలు నావి గనుక నా వినియోగం కొఱకు తీసుకొన్నా.

ఇట్లు,
సత్యవతి.

(నిర్విణ్ణుఁడై గుడ్లు వెళ్ళబెట్టుకొని నోరు తెఱచుకొని చూస్తాఁడు) ఎంతపని చేసిందిరా కూఁతురు కొఱ్ఱైన కూఁతురు, డబ్బు విషయంలో ఎవరినీ నమ్మకూడదు నిజంగా! "నందనుసయినన్ స్వమాత నయినన్ ధన మందున నమ్మవచ్చునే!" అని ఊరకనే అన్నాఁడా బలిజేపల్లి—హరిశ్చంద్రలో. గుమాస్తా విధవ గుటకాయస్వాహా చేసింది అయిదువేలు. కూఁతురు ముండ కొట్టివేసింది పదునైదువేలు. మొత్తం ఇరవై వేల రూపాయలు. పోయింది నా లక్షాధికారం. ఇరవై వేల రూపాయలు పోతే యిఁక ఎనభై వేలా తగలఁబడి! కొంపమునిఁగి ధ్వంసపారాయణమయింది నా లక్షాధికారం! (ఏడుస్తాఁడు గుండెపై చేయుంచుకొని) అబ్బో! అబ్బో! గుండెలు కొట్టుకొంటున్నయి! కొట్టుకొని కొట్టుకొని ఆఁగిపోవుగా — ఈ అదురుతో నా ప్రాణాలు లేచిపోతాయేమో? (గట్టిగా యేడ్చి) పోనీయను—

లేచిపోనీయను. నా ప్రాణాలకీ డబ్బుకీ ముడివేసికొని కూర్చుంటాను. ఒకవేళ బీదోళ్ళ ఉసురు ఆ ముడిని కాస్త తెగ్గొంచివేస్తే? నా ప్రాణాలకీ, డబ్బుకీ లంకె ఊడి పోతుంది. దానితో ప్రాణాలు కాస్తా బుఱ్ఱున లేచి పోతాయి. నేను బ్రతుకను. చచ్చిపోతా—నిజంగా చచ్చిపోతా—నేను చచ్చిపోతే, నా మేడ, మిద్దె, గచ్చు గలాబీలు, [illegible], నా యినప్పెట్టె, లెక్క-బొక్కసాలు ఎవరు చూస్తారు? (నవ్వు) నేనే- నేనే చూస్తుంటాను. నేను చచ్చిపోయినా పిశాచాన్నై, దయ్యాన్నై యీ మేడలో [illegible] తలుపులు వేసుకొని కాపుకాస్తుంటాను (అనుమానం) కొంప తలుపులు వేసి [illegible] ఎవరు? మేడలో దీపాల్లే పోతే గబ్బిలాలు [illegible]. గబ్బిలాల గుంపు నా [illegible] వాల్తాయేమో? వాలితే వాటి [illegible]. (మళ్ళీ అనుమానం) [illegible] నిద్రపోతూంటే [illegible] గబ్బిలాలు [illegible] వచ్చి [illegible] వేస్తా యేమో? [illegible] గబ్బిలాల పెంట. తూ—తూ—(ఉన్మాదం లో [illegible].)

[illegible]

సుబ్బు:— ([illegible]) ఎవరు నీవు?

కర్మ:— (నవ్వుతూ) నేనా? [illegible] నీ కర్మఫలాన్ని

సుబ్బు:— ఆఁ, అయితే ఎందుకిలా నవ్వుతావు?

కర్మ:— [illegible] నీ ఉన్మాదాన్ని చూచి.

సుబ్బు:— ఆఁ, నాకు ఉన్మాదమా? ఎవరంటారు?

కర్మ:- నేనే అంటున్నాను. లోకం గూడ అంటుందిక. స్వార్థపరుఁడా! ధనమే ప్రధానంగాఁ జూచుకొని దయాదాక్షిణ్యాలకు దూరమై లోపడిన పేదల్ని పీడించుకొని తింటున్నావు. పాపం! ఆ నిఱుపేద చేనేత పారిశ్రామికుణ్ణి పేరయ్యా నలా చేశావు. నీ కెంత బాకీఉన్నా మగ్గమాడక-డొక్కలు పూడక ఆలుబిడ్డలతో ఆఁకటి మంటల్లో అణగారిపోతూన్న ఆ పరిస్థితుల్లో ఆతణ్ణి యింట్లోనుంచి లేవదీయించావు. ఆ పేదవాఁ డెంత ఉసూరు మంటున్నాఁడో నీకు తెలియదు. పేదల ఉసురు తప్పుతుందా ? అనుభవించు నీ కర్మఫలం ! నీ వంటి వారికి గుణపాఠంగా ఈ ఉన్మాదమయ జీవితాన్ని అనుభవించు పో.

సుబ్బ:- (పిచ్చియేడ్పు, ఆ యేడ్పులో నేనవ్వు) నా వంటివారు-నాలాగే-అవుతారు. (నవ్వు) నిష్క్రమించును.

---

# ఆఱవ రంగము

(అనాటి పాడుపడిన సత్రం. శిథిలమై పడిపోతూన్న ఆ సత్రం లో ఇల్లువాకిలి లేని పేరయ్య తన ఆలుబిడ్డలతో తలదాచుకొంటుంటాడు. ఆ సత్రం పంచలో చిరిగిన చాపమీద పేరయ్య కొడుకు ఆకలితో పడియుంటాడు. మూర్తీభవించిన దీనావస్థవలె పేరమ్మ కూలిపనికిఁ బోయిన తనభర్త యేమైనా తెస్తే దానితో ఆ రోజు పబ్బం గడుపుకోవాలని ఎదురు చూస్తుంటుంది ఎంతో ఆశతో. తదనుగుణంగా ఇప్పటి యీ నేత కార్మికుని దుస్థితిని—తొలినాఁటి వస్త్రకారుని ఉన్నత స్థితిని తెలియఁజేస్తూ తెరలోనుండి ఒక పద్యం వినవస్తూంటుంది.)

పాలరాతి గృహాల బరగిన వారికి
తలదాచుకొన నేఁడు నెలవులేదు
పరుల మానాలు కాపాడినవారికి
కట్టుగుడ్డకు నేఁడు గతియులేదు
గొప్పబమాలకే అప్పులిచ్చిన వారి
కటిచేత నేఁడు కాసైన లేదు
ముప్పూటా మృష్టాన్నములు తిన్నవారికి
నిప్పుస్తులవి నేఁడు తిప్పలేదు
బంగరులోహాలు – పిడలు బందములుగను
మారిపోయిన గతి పడిమారిపోయె
పసిఁడిబిట్టలు పంగలు పండి, విశ్వ
మంతటనిండిన వస్త్రనిర్మాత బ్రతుకు.

పేరమ్మ:- (దీనంగా) మా కాపురం - కడగండ్లకు కాపురం - ఇల్లు పోయింది, వాకిలి పోయింది. ఈ సత్రం పంచలో పడిపంచలు పడుతున్నాం. పాడుబడ్డ యీ సత్రమూ, మా బ్రతుకూ ఒక్కటి. పడిపోతూన్న దీని గోడలు మా బ్రతుకుల్ని సూచిస్తున్నయి. మగ్గమే మనుగడగా బ్రదికే మాకు మగ్గం లేదు, ఉన్నా పని లేదు. చేతికి పని లేక, పొట్టకు కూడు లేక, ఉండటాని కింత యిల్లు లేక, పశువుల బ్రతుకుకన్న మా బ్రతుకులు కనాకష్టంగా ఉన్నయి. తిండి లేక, యిల్లు లేక అల్లాడు మా బ్రతుకులకన్న నిజంగా వేళకింత ఆహారం తెచ్చుకొని గూటిలో ఱెక్కలురాని తన పిల్లలకు పెట్టి పొద్దులుపుచ్చు పక్షి జీవితం చాలా మెఱుగు. పేరుకొన్న మా దారిద్ర్యం మా తనువులలోంగాని పోదేమో ?

ప్రసాద్:- (ఆకలితో) అమ్మా ! ఆకలమ్మా ! అన్నం లేక ఆకలి ఆకలి అని చివరకు మనమిలా చావవలసిందేనా అమ్మా !

పేరమ్మ:- (ఉప్పొంగే దుఃఖంతో) వద్దు. ఆ మాట అనకు నాయనా ! కాస్త ఓర్చుకొని పడుకో. ఏదైనా కూలి పనిచేసి తెస్తానని పోయాడు మీ నాన్న. రానియ్యి తొందరగా వండి ముందు నీకు పెడతాను.

ప్రసాద్:- (ఏడుస్తూ) అమ్మా! నాన్న కూలికి పోయాడా ? కూడు లేక డొక్కలెండి ఎముకల గూడైన ఆ ఒక్క బాబయ్య కూలిపని యేం చేస్తాడమ్మా !

పేరమ్మ:- ఏం చేస్తామురా! కడుపు కాలుతుంటే.

పేరయ్య:- (అప్పుడే వస్తాఁడు బిక్కముగంతో)
పేరమ్మ:- ఏమట్లున్నావు? ఆ కూలినిగూడా. దొ... ?
పేరయ్య:- (పొర్లేదుఃఖంతో) దొరుకుతుంది పని. నన్నుఁజూచి
నా బలువును జూచి పనిచేయించుకొనే వాళ్ళెవరు
చేద్దామన్నా. ఎక్కడికి పోయినా చుక్కెదురే మనకు.
పేరమ్మ:- ఎట్లాగో నిన్న ఆ కూలి తెచ్చిన నాల్గణాలతో నూక
లు తెచ్చుకొని కాలం గడుపుకొన్నాం. ఈ రోజది
గూడాలేదా? కొడుకల్లాడుతున్నాఁడే కూటికి. ఇప్పు
డేం దారి.
పేరయ్య:- (తెంపుగా) ఒక్కటేదారి. ఇద్దరమూ కలిసి,
కళ్లు మూసుకొని కాలవలో పడదాం.
పేరమ్మ:- మనం కాలవలో పడితే పిల్లవాడేం కావాలి?
పేరయ్య:- అదే వెనక్కులాగుతుంది మళ్ళీ పాడుమనసు.
ప్రసాదు:- ముగ్గురమూ చచ్చిపోదాం నాన్నా! ఆఁకటి మం
టల్లో మాడిమాడి చచ్చేదానికంటె అదే మేలునాన్నా!
అప్పుడుగాని మనల్ని పట్టిన దరిద్రదేవత తొలఁగిపోదు
నాన్నా!
పేరమ్మ:- (పెకలివచ్చే దుఃఖంతో) వద్దు. ఎవ్వరూ చావవద్దు
(మంగళసూత్రం తీసి పేరయ్య కిచ్చుచూ) ఇదిగో!
మంగళసూత్రం - దీన్ని ఎక్కడైనా-తెగనమ్మి బియ్యం
తీసుకొనిరా-పో-ఊఁ-పో అనుమానం వద్దు. పిల్లవాఁ
డాఁకలికి కొట్టుకొంటున్నాఁడు-ఊఁ-పో-త్వరగా-పో-పో.
పేరయ్య:- (నివ్వెఱపోయి) వద్దు - మాంగల్యం - అమ్మ
గూడదు - ఈ సూత్రమే పవిత్రమైన దాంపత్య ధర్మ
సూత్రము. దీన్ని అమ్మమంటున్నావా? తప్పు తప్పు.

పేరమ్మ:- (తెగువతో) తప్పులేదు, గిప్పులేదు. ఆకలి అమ్మి స్తున్నది. ఈ తాళిబొట్టుతోనే యీ రోజు గడవాలి - అనుమానించుతున్నావా? తీసుకో దీన్ని - ఊఁ - తొందరగా — తీసుకొని పో — దీన్నమ్మి బియ్యం తొందరగా తే—

పేరయ్య:- మర్యాద మట్టిలో గలుపుకొని, ఈ పాడుపొట్ట కోసం పెళ్లాం మెడలోని తాళిబొట్టమ్ముకోవటమా?

పేరమ్మ:- మానం-మర్యాద తరువాత చూచుకొందుముగాని ముందుప్రాణాలు నిలబెట్టు. వెనుకాడతావెందుకయ్యా! దీన్నమ్మండే యీ పూట మన ప్రాణాలు నిలుస్తవి. ఊఁ, తీసుకో దీన్ని. కొడుకు ఆకలితో కొట్టుకొంటుంటే నేను చూడలేను. తీసుకో దీన్ని ఇదుగో.

పేరయ్య:- దీనితో - ఈ రోజు గడుస్తుంది. రేపు మళ్ళీ మామూలే. ఇంతమాత్రానికి దీన్ని అమ్మమంటు న్నావు. వద్దు. దీన్నమ్మనవద్దు.

పేరమ్మ:- ఈరోజు గడిస్తే రేపు సంగతి రేపు చూచుకోవచ్చు. దీన్నమ్మి తేకపోతే ఆకలితో మృత్యుముఖానబడి ఉన్నాడే కొడుకు, ఒక్కగాని ఒక్క కొడుకు. వాణ్ణి చంపుకొంటామా?

పేరయ్య:- (దుఃఖంతో) వద్దు. వాణ్ణి చంపుకోవద్దు.

పేరమ్మ:- అయితే తీసుకో దీన్ని - ఇది మన సొత్తు. మన వస్తువుని మనమమ్ముకొంటే తప్పేముంది? ఇదిగో తీసుకో - అమ్మి బియ్యం తీసుకొనిరా (ఇచ్చును) పో- తొందరగా—

పేరయ్య:- పోతాను-అమ్ముతాను మంగళసూత్రాన్ని-బియ్యం తెస్తా-ఈ బీదలపాట్లిలా ఉన్నాయి--బీదలపాట్లు కవులు నాటకాలు వ్రాసేరోజు లయ్యాయి-ఎందుకు వ్రాయరు? కవులు నాటకాలు. పెళ్లాల మెడలోని తాళిబొట్టుల్ని సైతం తెగనమ్ముకొనే పేరయ్యలుంటే దేశంలో-ఈ పేరయ్యల విషాదగాధలు కవులెందుకు నాటకాలు వ్రాయరు? వ్రాస్తారు--వ్రాయాలి--దేశంలో ఇటువంటి వారి బ్రతుకులు ప్రజలు-ప్రభుత్వం గుర్తించాలి. పేదవాఁడు పేగుల్ని మాడ్చుకొని చచ్చిపోతుంటే - ఉన్నవాఁడు తాను తినటమే కాక తనయింట కుక్కలకూ, కోళ్లకూ పారబోసుకొంటున్నాఁడు. ఈ తీరకాను లోకానికర్థం కావాలి. ఈ దరిద్ర దేవత యినుప పాదాల క్రింద నిరాహార నిరుద్యోగ మహాపిశాచాల వికట నాట్యాలక్రింద నలిగిచచ్చే మా పేదల బ్రతుకులు-మా వస్త్రకారుల బ్రతుకులు లోకాని కందీయాలంటే కవులార్ద్ర హృదయాలతో అశ్రుసిక్తములైన కలాలతో మా విషాదగాధలు వ్రాయాలి. (వెళ్ళును)

(తెరపడాలి)



# ఏడవ రంగము

రాజమార్గము

(ప్రవేశం - ఆకటి మంటలకాగలేక భార్య మెడలోని మంగళ సూత్రాన్నమ్మి బియ్యం తీసుకొని పోవాలని వస్తూన్న పేరయ్య - నేపథ్యం లో తదనుగుణంగా ఆకలియొక్క విపరిణామాల్ని తెలియజేస్తు పద్యం విన పడుతుంది.

ఆకలి — రక్తమాంసముల
    ఆర్చి నరమ్ముల బిప్పిసేయు నా
ఆకలి—ప్రాణికోట్లను మ
    హాపరిశయాగ్ను లమాడ్చివేయు నా
ఆకలి—మృత్యుదేవతా భ
    యంకర కేళికి ముఖ్యహేతు వీ
ఆకలి—నూతనత్వ మణ
    గార్చెడు ఆకలి-ఎంతఘోరమో!

పేరయ్య:- మండిపోతూన్న మా ఆకలివలె, ఈ యెండెంత మండిపోతూంది? కడుపులో కాలుతున్న దానికిదోడు కాళ్లు కాలుచున్నవి, నెత్తిగాలు చున్నది. ఏం చేసేది? ఎక్కడైనా ఈ మంగళసూత్రాన్ని తెగనమ్ముకొని తొందరగా బియ్యం తీసుకొని పోవాలి.

(వెనుక ప్రక్కన వికటాట్టహాసం.)

పేరయ్య:- (తిరిగిచూచి) ఎవరా నవ్వేది?

అన్నాను – ఈ మంగళసూత్రాన్ని తెగనమ్మాను–తిరిగి పోతాను (వెనుకకు తిరిగి పోబోవును)

అమీరాద్ ఖాన్:– (వెనుకనుండి వస్తూ) ఏయ్ పేరయ్యా ! నీకి హెక్డా పోతావ్ ?

పేరయ్య:– ఎవరివి నీవు? (తేరిచూస్తాడు)

అమీరాద్:– హాఁరె! హేమ్టి షూస్తావ్ నీకి ధెయ్యాం లాగ.

పేరయ్య:– (గుర్తించి) ఖాన్‌గారూ! మీరా? ఇక్కడికెందుకు వచ్చారు ?

అమీరాద్:– హాఁరె ! నీకోషం త్రిగ్గి త్రిగ్గి సచ్చాం. హింటికి పోయాం. హిల్లు అప్పువాడ్కి పోయింది అంటగా. నీకీ నెత్తిమీదా పిల్కానై. మాదీ బాకీమాట హేమ్టీ షెప్తావ్.

పేరయ్య:– (దీనంగా) ఇప్పుడేం చెప్పమంటావు? ఇల్లుపోయింది. చెట్టుకొట్టి గట్టుకొన్నట్లయింది మా పని. తిండిలేక మాడిచస్తున్నాం. ఇప్పుడు మీరు బాకీమాట చెప్పమంటే మూల్గేనక్కమీద తాటికాయ పట్టేట్లున్నది.

అమీరాద్:– హాయితే మాదీబాకీ హియ్యనంటావ్ ?

పేరయ్య:– ఇయ్యనంటున్నానా ? ఇస్తాను.

అమీరాద్:– హెప్డూహయ్యా హింకా యిచ్చేది?

పేరయ్య:– ఇస్తాను. చావక బ్రతికుంటే.

అమీరాద్:– హాఁరే, హేమ్టి మాటల్ నాకీ హాయోమయం. నీకి బుద్దీ ఉందిలేదూ హయ్యా! మాదీ దగ్గరా పైకం వాయిదాకీ తీసి నెలల్కి నెలల్కి ఘడిపేస్తున్నావ్. మాకీ పైకం నిండా జరూర్. హిప్డే యిచ్చితీరాలి సచ్చితీరాలి.

పేరయ్య:- నీ వన్నా అనకపోయినా సిద్ధంగనే ఉన్నా చావటానికి.

అమీాద్:- హారె, నీకీ చస్తే నాదీ పైకం జబాబ్‌దారీ హావరూ హాయ్యా!

పేరయ్య:- మీా డబ్బుకు నేనే జబాబుదారిని. నేను చచ్చిపోయినా వచ్చే జన్మలో మీా యింటి కుక్కనై పుట్టి తీరుస్తాను. కానీ, ఇప్పుడే యిచ్చితీరాలి చచ్చితీరాలని మెడగోసుకొంటే నే నెక్కడ తెచ్చేది ?

అమీాద్:- (కొంచెం కోపంగా) హారె, నీకీ పైకం హిచ్చి మాదీ మెడగోసుకోమంటావ్ ? హేమ్టి మాట కూశావ్ పెద్దామడిషీ ! నీకీ హింకా షూడం మాది పైకం కట్టి కదులు (చేయిపట్టి లాగును పేరయ్య ముందుకు పడును.)

సుధాకర్:- (హాఠాత్తుగావచ్చి) ఆఁ, ఆఁ. ఏమిటీ దౌర్జన్యం నడివీధిలో—ఈ నిరుపేదవాణ్ణి కొట్టటానికి నీ వెవరవు?

అమీాద్:- నాదీ బాకీ యియ్యకపోతే లగాయించాం. హేమ్టి తప్పు షెప్పుహాయ్యా !

సుధా:- ఏం, బాకి యియ్యనంతమాత్రాన నడివీధిలో పట్టుకొని యిలా బాధిస్తావా ?

పేరయ్య:- నేను బాకీ యియ్యనంటున్నానా ?

అమీాద్:- ఇస్తాడ్ బాకీ. 'మళ్లీ జన్మలో కుక్కాఐపుట్టి' హేంటో హేమ్టో యేదాంతం సెప్తాడ్ ! నాకీ హాయోామయం.

సుధా:- అయోామయం కాకపోతే యేమఁంది. కడుపునిండిన మ్మ మగని ఆఁకలి యెఱుగదన్నట్లు. నీకేం తెలుసు

[illegible] [illegible]
యీా పేదవాణ్ణి యీా స్థితిలో నీవు బాకీ [illegible] కచ్చి
[illegible]

అమీాద్ :- పేరయ్యకి [illegible] లేదండీ [illegible]
సుధా :- [illegible] లేదు. [illegible] పేరయ్యా చేతిలో [illegible]
అమీాద్ :- [illegible] వచ్చి
[illegible] లేదండి
[illegible]
సుధా :- [illegible] అమూ [illegible] పేరయ్య
[illegible] పని [illegible] చేస్తా [illegible] టావు?
[illegible] లో
[illegible] సిచ్చి
నేస్తాయండి సిచ్చి. [illegible]
[illegible]
[illegible]
అమీాద్ :- [illegible] ఉండి
బాకుల్లో. [illegible]
సుధా :- [illegible]
అమీాద్ :- బాకు హాండి! [illegible] మరిచిపోయాం.
సుధా :- సరి, [illegible]
[illegible] తీసుకొని [illegible]
[illegible] పేరయ్య [illegible]
అమీాద్ :- పేరయ్య బాకీ నీ కీ [illegible] అవుతావు
[illegible] పేరయ్య [illegible]
[illegible] పేరయ్య [illegible]

అమీరాద్:- (ఆశ్చర్యంగా) పేరయ్యాకి నీకి ఒక్క హామాన్తె కడుపులో పుట్టినారు హాండి ?

సుధా:- ఒక్క కడుపులోగాదు. ఒక్క కులంలో పుట్టాం. పేరయ్య నాకేమైతే నీ కెందుకు ? నీవు శేపురా, పో.

అమీరాద్:- షరి, పెద్దామడిషీ సెప్పావ్. హిప్పూపోయి శేపు వచ్చి కూకుంటాం. షలామ్. మాకీ షెలవు. (రెండడుగులు పోయి మళ్లీవచ్చి) మీఁది హిల్లూ హెక్డా హాండి !

సుధా:- మా యిల్లా ? ఊళ్లోనే.

అమీరాద్:- (పోయి మరలవచ్చి) మరిసీపోయాం మీఁది పేరూ హేట్టి హాండి !

సుధా:- నా పేరు సుధాకరరావు.

అమీరాద్:- షుధాకరరావ్. అచ్ఛా అచ్ఛా (వెళ్ళును)

సుధా:- పేరయ్యా ! కొంపకాస్తా బాకీకిౕంద సుబ్బరాజు స్వాధీనం చేసుకొన్నాఁడని విన్నాను. పెళ్లాం బిడ్డలతో ఎక్కడుంటున్నావు పాపం !

పేరయ్య:- ఎక్కడుండమంటాను, ఇళ్లులేనివాళ్ళని ఎవరు రానిస్తారు. ఆ పాడుబడ్డ సత్రింలో పడుంటున్నాం.

సుధా:- పాపం ! నిరాధారులైన మిమ్మల్ని ఇంట్లోనుంచి లేవదీయించటానికి ఆ సుబ్బరాజుకి మనసెల్లా ఒప్పిందో ! ఆతని గుండె గుండెకాదు నల్ల రాతిబండ. కానీ, అనుభవిస్తున్నాఁడు ప్రతిఫలం. పేదల ఉసురు ఊరకే పోతుందా ?

పేరయ్య:- ఏమిటట్లుంటున్నారు ?

సుధా:- ఎంత తనకు బాకీఉన్నా నిండుసంసారాన్ని కొంపలో

నుంచి లేవదీయటమా ? మీ ఉసురు తగిలి పిచ్చి ఆస్పత్రిలో ఉన్నాడు.

పేరయ్య:- (జాలిగా) ఆయనకి పిచ్చిపట్టిందా ? పాపం !

సుధా:- పాపమని జాలితలుస్తున్నావా ? నీకు చేసిన మహోప కారానికి. పిచ్చి పేరయ్యా ! ఏమిటి నీ హృదయం?

పేరయ్య:- నాహృదయం ఏమీకాదు. కష్టం సహింపరానిది. పగవాళ్ళకైనా కష్టాలు కోరుకోవటం నాకిష్టంలేదు. అందరూ బాగుండాలి.

సుధా:- పేరయ్యా ! నీవొకర్ని జాలిదలంచుతున్నావు. ఉండనిల్లు,వండపానుప్పు, తినతిండిలేక ఆలుబిడ్డలతో అల్లా డుతున్నావే. నిన్ను జాలితలంచే వాళ్ళెవరు ?

పేరయ్య:- నన్నెవరూ జాలితలంచవద్దు. నేనుమాత్రం పగ వాళ్ళకైనా కష్టంవచ్చిందంటే సహించలేను. అది నా స్వభావం. ఏం చేయమంటావు?

సుధా:- ఆ భావమే లోకంలోని ప్రజలందరికీ ఉంటే లోకం స్వర్గలోకం కాదూ ? పేరయ్యా ! మొగమలా వాడి పోయిందేం ? అన్నం తిన్నావా ? పాపం !

పేరయ్య:- లేదు. అన్నానికి బియ్యంలేక— (మంగళసూత్రం బయటికి తీయును.)

సుధా:- (చూచి చకితుడై) ఏమిటది మంగళసూత్రమా ?

పేరయ్య:- ఆఁ, మంగళసూత్రమే. దీన్ని తెగనమ్మి బియ్యం తీసుకొనిరమ్మని నా భార్య ఇచ్చింది. అక్కడ పిల్ల వాడాకలికి నిలువలేక అల్లాడుతున్నాడు.

సుధా:- (ఉద్విగ్న హృదయంతో) ఎట్టి సంఘటన ! వస్త్ర నిర్మాత జీవిత మే స్థితికి వచ్చింది! తిండిగింజలు లేక

పెళ్లాం మెడలో తాళిబొట్టును సైతం అమ్ముకొంటు న్నాఁడు! ఆశ్చర్య మేమిటి? అన్నం పెట్టలేక కన్న బిడ్డల్నే అమ్ముకొంటున్నాఁడు. జమీందార్లకే అప్పు లిచ్చిన జాతియిది, ఎంత తారుమారయింది!

బంగారమది పంటపండిన గేహాలు
నిప్పచ్చరాలతో నిండిపోయె
మజిలీన్లు పొరుగుసీమలకంపిన గృహాలు
మగ్గాలుసాగక మాటుమణఁగె
సిరులకాణాచిగాఁ జెలఁగిన యిండ్లలో
ఇనుపగజ్జెలతల్లి యేలుచుండె
అన్నపూర్ణకు నిలయమ్ములౌ నిలయమ్ము
లన్నాతురుల కూటి అఱపులయ్యె
కీరుతులు దీవులన్నిట బాఱఁజల్లి
భారతీయతకే గర్వకారణమగు
వస్త్రనిర్మాత జీవిత పథము నేఁడు
కంటకంబయి పోయెగా కాలమహిమ!

పేరయ్యా! ఆడవాళ్ల మెడలోని ఆ తాళిబొట్టెం దుకమ్ముతావు. ఇదిగో! ఈ రెండు రూపాయలు తీసుకొని తొందరగా బియ్యం తెచ్చుకోపో — నీ ఆలుబిడ్డలాఁకలి కేడుస్తున్నారో పో — పాపం నీ కొఱకెదురు చూస్తుంటారు. (రెండు రూపాయల నోటు ఈఁబోవును)

పేరయ్య:- (తీసుకోవటాని కనుమానిస్తున్నాఁడు)

సుధా:- అనుమానిస్తున్నావా? పేరయ్యా! తీసుకో (ఇచ్చి) అన్నట్లు మాటల్లో మఱచిపోయాను. సుబ్బరాజు కూఁతురు సత్యవతి నీ విషయం ఉత్తరం వ్రాసిందినిన్న.

నీ యిల్లు నీకు యిచ్చివేస్తానని, నీకు కొంత డబ్బు గూడ మణియార్డరు ద్వారా పంపిస్తానని వ్రాసింది.

పేరయ్య:- (సంతోషంతో) ఆఁ, నిజంగానా ? ఎందుకో ఈ పేదవాఁడిమీద ఆమెకంతదయ.

సుధా:- ఇది ఆమె స్వభావం. బీదలంటె జాలిగుండె గలది సత్యవతి.

పేరయ్య:- ఆమెచాల ఉత్తమురాలు.

సుధా:- సర్వోత్తమురాలు. మణియార్డరు రాగానే స్వయంగా నీకు తెచ్చియిస్తాను. చాల కష్టాల్లో ఉన్నావు పాపం ! నైరాశ్యపడకు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతాన్ని గడుపు. ఏ నాఁటికైనా మంచిరోజులు రాకపోతాయా ? ప్రస్తుతం మన జీవన సమస్య క్లిష్టంగా ఉన్నా దానికి భవిష్యత్తున్నదేమో? మన జీవిత సమస్యా పరిష్కారం కోసం పోరాడుతున్నారు మననాయకులు. ప్రభుత్వం గుర్తిస్తుందని ఆశ గలుగుతున్నది. అందాక కష్టాలిలాగే పడాలి. తప్పదు. స్వాతంత్ర్యం మాత్రం మన దేశానికి మాటల్తో వచ్చిందా ? ఎంతమంది మహావ్యక్తులు తమ జీవితాలను ధారపోశారు.

స్వాతంత్ర్యలక్ష్మి పిపాసులై తమ తమ
తియ్యని ప్రాణాలు తెగవచేసి
తల్లి తోత్తఱికంపు - తాళ్ళను తప్పింప
తమ జీవితాలనే ధారపోసి
దేశము కోసమై క్లేశమందుచు ఉరి
కంబాలమీద రక్తబలిచేసి


సత్యాగ్రహాలలో శాంతియుద్ధాలలో
లాఠీలచే మేని తాటబాసి

అన్ని విధముల మన కాదర్శమై యొప్పి
భారతోద్ధరణకు పాటుపడిన
జాతి మనది - ఓర్పు జన్మహక్కు మనకు
మహిని త్యాగగుణము మనదుసొత్తు.

మహాత్ముడు చూపిన యీ బాటనే మన మనుసరిస్తాం—పేరయ్యా! చాల వేళయింది. పో— బియ్యం తెచ్చుకో—నీ ఆలుబిడ్డ లెంతల్లాడుతున్నారో? తొందరగా పో—

పేరయ్య:- (వెళ్ళును)

(తెరపడును)



పేరమ్మ:- లెండిపోదాము! నెమలి కంటనీరుగారిస్తే వేటగానికి ముద్దా? (కొడుకును లేపుతూ) లే నాయనా!

పరిసాద్:- ఇప్పుడెక్కడికి పోదామమ్మా! ఆఁకలమ్మా! నడవ లేనమ్మా!

పేరయ్య:- (దుఃఖముతో నోట మాటరాదు కొడుకు నెత్తు కొంటాఁడు)

పేరమ్మ:- (మూటదీసుకొని చిరిగిన చాపచుట్టి చంకఁ బెట్టు కొంటుంది. నడుస్తారు అర్థంగాని అయోమయావస్థతో ఎక్కడికో- వారి దుర్గతిని సూచిస్తూ తెరలోనుండి విషాద వీణాతంత్రుల్లో మేళనమై పాట వినపడుతుంది)

గే య ము

పదపదా నిర్భాగ్య వస్త్రకారకుఁడా!
పదవోయి! పదపదా వస్త్రకారకుఁడా!!
చెదరిన హృదయాన - చెదిరిన ధైర్యాన
పదములు గుదివడ కదలలేకున్నావ? ॥పద॥
పేరినకష్టాలు- ఆరని ఆఁకలి-
తీరని దారిద్ర్య తీవ్రయాతనలో
మారని జీవిత మారణాధ్వరములో
మారణమే అనివారణ మేమో? ॥పద॥

---

# ఎనిమిదవ రంగము

సత్రము

(ఆ సత్రం పంచలో పేరయ్య కొడుకు ప్రసాదు ఆకలితో సొమ్మసిల్లి పడిఉంటాడు లోపల పేరమ్మ కుటుంబ దుస్థితికి సహించలేక ఆత్మహత్య చేసుకొని పడిఉంటుంది. ఇంతలో స్పృహ తెలిసి ప్రసాదు తలెత్తిచూచి తల్లిని పలుకరిస్తాడు.)

ప్రసాద్:- అమ్మా!—పలుకవేమమ్మా!—దాహమమ్మా!— నాలుక లాక్కొనిపోతుందమ్మా – నిద్ర పోతున్నావా అమ్మా—మంచినీళ్ళమ్మా—(అనుమానంతో) పలుకవేమమ్మా – చచ్చిపోయావా అమ్మా! (ఏడుస్తాడు) నిజంగా చచ్చిపోయావా అమ్మా — అయితే నేను కూడ చచ్చిపోతాను—నేను బ్రతుకనమ్మా—నాన్న కూడ చచ్చిపోతాడు. మనందరి చావులతో— దేశంలో మనవంటి కుటుంబాలున్నాయని లోకం గుర్తిస్తుంది— దేశంలో – మనవంటి పేదలు బ్రతికుండేదాని కంటె చచ్చింది మేలమ్మా—

పేరయ్య:- (బియ్యం మూటతో అదే సమయానికి వస్తాడు) అబ్బాయి! ఆకలికి నిలువలేక ఏడుస్తున్నావా నాయనా! ఇదిగో! బియ్యం తెచ్చాను. ఇప్పుడే అమ్మవండి ముందు నీకు పెట్టుతుంది.

ప్రసాద్:- (పెద్దగా ఏడుస్తూ) వచ్చావా నాన్నా! (ఏడ్చును)

పేరయ్య:- ఏడువకు నాయనా! కాసేపట్లో అమ్మ అన్నం వండి నీకు పెట్టుతుందిగా—మీ అమ్మేది?

ప్రసాద్:- (ఏడుస్తూ) అమ్మ పోయింది నాన్నా —

పేరయ్య:- (గాబరాగా) అమ్మ యెక్కడికి పోయింది?

ప్రసాద్:- అదిగో—చచ్చిపోయింది నాన్నా — చచ్చిపోయింది. (తండ్రి కాళ్ళకుఁ జుట్టుకొని బిగ్గరగా ఏడుస్తాఁడు)

పేరయ్య:- (ఆకస్మిక దుఃఖావేశంతో) ఆఁ,—ఆఁ చచ్చిపోయిందా — (భార్యపైఁబడి ఏడుస్తూ) ఆఁకటి మంటల కాఁగలేక చచ్చిపోయావా—దారిద్ర్యపు పెనుభూతానికి బలైపోయావా—అయ్యో! నన్ను దిక్కుమాలిన వాణ్ణిచేసి, దిక్కుమాలిన మానవలోకంలో ఉండనిష్టంలేక దేవలోకానికి పోయావా—అక్కడ దేవుళ్ళతో మన పేదజాతిని గురించి మొఱపెట్టుకోఁ బోయావా — బీదల సమస్య లక్కడ పరిష్కారానికి తెస్తావనుకొన్నావా—ఈ యాశయే నీకున్న ఉండు—క్షణముండు—నేనుగూడ వస్తున్నాను—మనిద్దఱమూ కలిసి ఏకంగా దేవుళ్ళతో మన బీదలపాట్లు విన్నవించుకొంటాం — స్వార్థపర మానవలోకంలో మన గోడాలకించేవాళ్ళు లేరు. అచ్చట దేవలోకంలో—హెచ్చులొచ్చులు మచ్చుకైనా ఉండవు—అక్కడ సుఖంగా—హాయిగా—ఉండవచ్చు. ఆఁగు—క్షణమాఁగు—నేఁ గూడ వస్తున్నా—(కొడుకు దగ్గరికి వచ్చి) అబ్బాయి! ప్రసాద్—పలుకవేరా నాయనా—(మరింత దుఃఖంతో) అయ్యో!

నీవుగూడ ఇప్పుడే కళ్ళు మూశావా—ఆకలికి నిట్టనిల్లి చివరకు శాశ్వత సుఖ నిద్రలో ఒరిగిపోయావా—నీవు గూడ దారిద్ర్య భూతాని కాహుతైపోయావా— అయ్యో—(ఏడ్చును.)

(కొంత నిబ్బరపడి ఇంకొక ధోరణిలో) పో— తొందరగా పోయి మీ అమ్మతో కలుసుకో—వెనుకా ముందుగా నేగూడ మీతో కలుసుకొంటాను.

భార్య పోయింది కొడుకు పోయాడు-పేరయ్య మిగిలాడు (పిచ్చినవ్వు) మిగిలాడు పేరయ్య — పెళ్లాం బిడ్డల్ని బ్రతికించుకోలేని పేరయ్య మిగిలాడు. (నవ్వు) మిగిలాడు చవట పేరయ్య.

(పిచ్చిధోరణిలో) నవ్వుతున్నారా— నవ్వండి— పేరయ్య బ్రతుకంతనవ్వుల పాలయింది (ఏడ్చును) ఏడుస్తున్నారా ఎందుకు? నన్ను చూస్తే మీకు ఏడ్పు వస్తుందా? నా కుటుంబంమీద మీకు సానుభూతి నిజంగా ఉంటే మా ఆకటి చావుల్ని ప్రభుత్వాని కందియండి. పేరయ్య కుటుంబం ఆకటి మంటల్లో సర్వనాశనమై పోయిందని లోకానికి చాటండి: —కూడులేక మే మిలా చచ్చి పోయినా—రోగాలచేత చచ్చిపోయారని ప్రభుత్వానికి అభాండాలు చెప్పే పెద్దమనుష్యు లున్నారు. ఈ విషయంలో మీరే సాక్ష్యం.

నిరాహార భూతానికి నా ఆలుబిడ్డలు బలి అయ్యారు—దానికింకా శాంతి కలుగలేదు—నా ప్రాణాల్ని గూడ బలి యీయమంటుంది-నా ఆత్మార్పణంతో

ఆ మహాసూత్రానికి పరిపూర్ణ శాంతి కలిగిస్తాను. నేటితో దాని అశాంతిని నివారిస్తాను. నా జీవిత విశ్రాంతితో విశ్వశాంతికైనా దారి కలుగుతుందేమో చూస్తాను— ఓం శాంతిః—శాంతిః—శాంతిః— (పడి మరణించును.)

(తెరలో నుండి)

ఓ దయలేని ఆకటికి
 ఉల్లముబాస! దరిద్రదేవతా!
పేదల నెందుకే యిటుల
 పిప్పియొనర్చెద విందునైన స
మ్మోదముపొంది వేతొలఁగి
 పోఁగదె భారత భూమినుండి; నీ
పాదము సోకనీయకునె
 పచ్చని మా తెలుఁగమ్మ యింటిలో.

---